

రైతులను రాజులను చేసేందుకు
సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు.
రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి
ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నారు.
మామిడి, ఉల్లి, టమోటా, పొగాకు,
మిర్చికి మద్దతు ధర కల్పించారు.
వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం మాని
రైతు సంక్షేమాన్ని స్వాగతించాలి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 03.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 163 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# కరవు సీమను సిరులసీమగా మారుస్తాం



మదనపల్లె, అక్టోబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్) : కరవుసీమగా పేరున్న రాయలసీమను సిరుల సీమగా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. 2024 ఎన్నికల్లో కూటమిని గెలిపించిన మరుక్షణం నుంచి ప్రజలకు మేలు చేయాలనే తలంపుతో ఉన్నామని... దాంట్లో భాగంగానే రాయలసీమలోని ఎనిమిది జిల్లాలు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఉద్యాన రైతులకు మేలు చేసేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టామని చెప్పారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం గ్లోబల్ హార్టికల్చర్ హబ్-GHH, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్-ISAకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. కేంద్ర సహకారంతో రూ.40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడులతో మరో రూ.60 వేల కోట్లను సమీకరించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు అన్న మహాత్మాగాంధీ ఆశయాన్ని సాకారం చేసే దిశగా రాయలసీమలో చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతో కరవుసీమను రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఉద్యాన రంగం ప్రాథమిక రంగం వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రస్తుతం

2 లో






- ఉద్యానరంగ అభివృద్ధితో ఆర్థికాభివృద్ధి
- రూ. లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు శ్రీకారం
- రిలయెన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన

- మదనపల్లెలో రెండు బృహత్తర ప్రాజెక్టులకు అంకురార్పణ చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- తనను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించమని సీఎంను కోరిన అనంత్ అంబానీ
- అనంత్ అంబానీ ఏపీ ముద్దుబిడ్డ అంటూ ముఖ్యమంత్రి ఆలింగనం

## ఎమ్మెల్సీ ఆలపాటి సమన్వయంలో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు



తెనాలి, అక్టోబర్ 2(జర్నలిస్ట్ ఫైల్) : తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో అక్టోబర్ 4న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం తెనాలి టీడీపీ ఇంచార్జ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సమన్వయంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పర్యటించారు. సీఎం చేతుల మీదుగా త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగ సభ ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో తొలిసారిగా ఆధునిక త్రీడీ ప్రింటింగ్ సాంకేతికతతో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక చొరవతో రాష్ట్రానికి అదనంగా మూడు లక్షల ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మార్చిలోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని, మిగతా 2లో...

## రైతులే రేపటి సీఈవోలు కావాలి

- నన్ను ఆంధ్ర బిడ్డగా భావించండి
- రాయలసీమ ఉద్యాన హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌లో రిలయన్స్ భాగస్వామ్యం
- అనంత్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్

మదనపల్లె (జర్నలిస్ట్ ఫైల్) : వ్యవసాయాన్ని ఆధునిక సాంకేతికత, పరిశోధనలు, ఆవిష్కరణలతో అనుసంధానించి రైతులను పారిశ్రామికవేత్తల స్థాయికి తీసుకెళ్లాల్సిన సమయం వచ్చిందని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ అన్నారు. ప్రపంచానికి ఎంతోమంది ప్రముఖ సీఈవోలను అందించిన భారత్ భవిష్యత్తులో రైతులను కూడా సీఈవోలుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.



అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమంలో అనంత్ అంబానీ పాల్గొన్నారు. మిగతా 2లో...

## కరవు సీమ కాదు.. అభివృద్ధి సీమ



- రూ.లక్ష కోట్లతో సమగ్ర హార్టికల్చర్ ప్రణాళిక
- ప్రపంచ స్థాయి ఉద్యాన హబ్‌గా రాయలసీమ
- రైతు పొలం నుంచి ప్రపంచ మార్కెట్ వరకు పూర్తి వ్యవస్థ
- మూడు దశల్లో 10 జిల్లాల్లో ప్రణాళిక అమలు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

మదనపల్లె(జర్నలిస్ట్ ఫైల్) : కరవుతో పోరాడిన రాయలసీమను ఇకపై కరువు సీమగా కాకుండా, ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు సాగు నీటి సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు, పంటలను మార్కెట్లకు వేగంగా తరలించేందుకు అవసరమైన రహదారులు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అలాగే, రైతులు పండించిన మిగతా 3లో...

## హార్టికల్చర్ హబ్‌తో సీమకు కొత్త రూపు

### నాడు హామీ.. నేడు సాకారం

- పాదయాత్రలో రైతులకు హామీ ఇచ్చిన లోకేష్
- యువగళంలో ఇచ్చిన మాటకు కార్యరూపం
- కడపలో ప్రకటించిన 'మిషన్ రాయలసీమ'కు ముందడుగు
- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో సమగ్రప్రణాళిక

మిగతా 4లో...

- హార్టికల్చర్ హబ్‌తో వ్యవసాయ రంగ రూపురేఖల్లో మార్పు
- రైతు సత్తాను ప్రపంచానికి చాటుతాం:లోకేష్



మదనపల్లె (జర్నలిస్ట్ ఫైల్) : హైదరాబాద్ లో ఐఎస్ బి తరహా మ్యాజిక్ ఇప్పుడు రాయలసీమలో జరగబోతుంది. ఇక్కడకు రాబోయే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ వ్యవసాయరంగ రూపురేఖలు మార్చబోతోందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మిగతా 4లో...

## దేశంలో అగ్రస్థానమే లక్ష్యం



- దశాబ్దంలో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగగలదు
- కొత్త ఆలోచనలకు ఏపీని బెంచ్‌మార్క్‌గా తీర్చిదిద్దుతాం
- పాన్-ఐఐటీ టీమ్ డిన్నర్‌లో మంత్రి నారా లోకేష్

మిగతా 4లో...

## స్వచ్ఛత.. ప్రజా ఉద్యమం కావాలి

ఐదు కోట్ల మంది భాగస్వామ్యంతోనే శాశ్వత మార్పు

నదుల్లో వ్యర్థాలు, మురుగునీరు వదలొద్దు

చెత్తను సంపదగా మార్చేలా చర్యలు

స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్ర:సీఎం చంద్రబాబు

3 లో



## ఎస్‌హెచ్‌జీ రుణాల్లో ఏపీ నంబర్ వన్



- రూ.82,639 కోట్ల రుణ నిల్వతో దేశంలో అగ్రస్థానం
- పారదర్శకత, సాంకేతిక సంస్కరణలతో మహిళా ఆర్థిక సాధికారతకు పెద్దపీట
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

2 లో

## 21 జిల్లాల్లో 388 కరవు మండలాలు

- 283 మండలాల్లో తీవ్ర కరవు.. 105 మండలాల్లో మధ్యస్థ పరిస్థితులు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం, తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 21 జిల్లాల్లో 388 మండలాలను ముందస్తు కరవు ప్రాంతాలుగా ప్రకటించింది. వీటిలో 283 మండలాల్లో తీవ్ర కరవు, 105 మండలాల్లో మధ్యస్థ కరవు పరిస్థితులు ఉన్నట్లు పేర్కొంది. ఈ మేరకు సీఎస్, రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కరవు ప్రభావిత ప్రాంతాల్లో రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు ఉపశమన చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.

జూన్ నుంచి ఆగస్టు వరకు రాష్ట్రంలో 424.3 మి.మీ. సాధారణ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 197.6 మి.మీ. మాత్రమే నమోదై మిగతా 2లో...

## రైతులకు కేంద్రం అండ

- లక్ష కోట్ల హార్టికల్చర్ హబ్‌తో రాయలసీమకు కొత్త గుర్తింపు
- రాయలసీమను రతనాల సీమగా మార్చే రెండు కీలక ప్రాజెక్టులు
- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



మదనపల్లె (జర్నలిస్ట్ ఫైల్) : లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న హార్టికల్చర్ హబ్ రాయలసీమను రతనాల సీమగా మార్చే దిశగా కీలక అడుగు అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఈ భారీ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వంతో మిగతా 2లో...

## ఎమ్మెల్సీ ఆలపాటి సమన్వయంలో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు



(మొదటి పేజీ తరువాయి)

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పెమ్మసాని రవికుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ ఎండీ హెప్సీబా రాణి, ఆర్డీవో శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.

## 21 జిల్లాల్లో 388 కరవు మండలాలు

(మొదటి పేజీ తరువాయి)

53.43 శాతం లోటు ఏర్పడింది. వర్షపాత లోటుతో పాటు సాగు విస్తీర్ణం, రిమోట్ సెన్సింగ్ సూచీలు, నేల తేమ, జలాశయాల నీటినిల్వలు, భూగర్భజల పరిస్థితి, క్షేత్రస్థాయి పరిశీలనలను అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. అన్నమయ్య, చిత్తూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని అన్ని మండలాలను కరవు ప్రాంతాలుగా గుర్తించారు.

లోటు వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, వర్షాల మధ్య సుదీర్ఘ విరామం, జలాశయాలకు నీటి ప్రవాహాలు లేకపోవడం, కాలువలకు నీటి విడుదల తగ్గడం వంటి కారణాలతో సాగు విస్తీర్ణం తగ్గింది. రైతులు, వ్యవసాయ కూలీలకు పనులు తగ్గడంతో పాటు పశువులకు మేత కొరత, పాల ఉత్పత్తిపై ప్రభావం ఏర్పడింది. ఇప్పటికే సాగులో ఉన్న పంటలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాల్సి రావడంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. కరవు మండలాల్లో పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, కొత్త రుణాల మంజూరు, పెట్టుబడి రాయితీలు, తాగునీటి సరఫరా, పశువులకు మేత, ఉపాధి హామీ పనుల విస్తరణ వంటి చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం ప్రకటించినవి ముందస్తు ఖరీఫ్ కరవు మండలాలని, పరిస్థితులపై తదుపరి సమీక్ష అనంతరం రెండో విడత జాబితా ప్రకటించే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లాలో మరో 12 మండలాలను కరవు జాబితాలో చేర్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రతి గ్రామంలో బీజేపీ మోర్చాల నెట్‌వర్క్ విస్తరణ



• ఏపీ బీజేపీ ఇన్‌చార్జ్ అరవింద్ బదౌరియా

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అనుబంధ మోర్చాలను మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు ఏపీ బీజేపీ ఇన్‌చార్జ్ అరవింద్ బదౌరియా తెలిపారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అనుబంధ మోర్చాల రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అరవింద్ బదౌరియా మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీకి అనుకూలంగా ఉన్న అవకాశాలను గుర్తించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనుబంధ మోర్చాలు క్షేత్రస్థాయిలో బలంగా పనిచేస్తే పార్టీ సంస్థాగతంగా మరింత పటిష్టమవుతుందని అన్నారు. ప్రతి గ్రామంలో మోర్చాల నెట్‌వర్క్‌ను విస్తరించాలని, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని సూచించారు.

గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అనుబంధ సంఘాల కార్యకలాపాలను విస్తృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై నిరంతరం పనిచేయడంతో పాటు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మోర్చాలు క్రియాశీలకంగా వ్యవహరించాలని నాయకత్వం సూచించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి అవసరమైన కార్యాచరణను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఏపీ బీజేపీ సహ ఇన్‌చార్జ్ వనతి శ్రీనివాసన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు.

## గాంధీ, శాస్త్రి జయంతి సందర్భంగా ఘన నివాళులు



**గుంటూరు, అక్టోబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్) :** మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ భవనంలో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షరీఫ్, సిటీ అధ్యక్షుడు చింతల కళ్యాణ్ కుమార్, సిటీ కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా, సిటీ కార్యవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. సత్యం, అహింస, దేశభక్తి, నిస్వార్థ సేవ వంటి గాంధీ, శాస్త్రి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

# కరవు సీమను సిరులసీమగా మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)



సుమారు రూ. 1.50 లక్షల కోట్ల జీవీఏ అందిస్తున్న ఈ రంగం ద్వారా మరో రూ. లక్ష కోట్ల జీవీఏను సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా 5,860 గ్రామాలను 201 క్లస్టర్లుగా అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 6 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగును విస్తరించేలా ఈ ప్రాజెక్టులో కార్యాచరణ చేపట్టనున్నామన్నారు. రైతులకు ఉత్పత్తి నుంచి మార్కెటింగ్, ప్రాసెసింగ్, ఎగుమతుల వరకు సమగ్ర మద్దతు అందించడమే హార్టికల్చర్ హబ్ ప్రధాన ఉద్దేశమని సీఎం చంద్రబాబు చెప్పారు. పంటల స్థిరీకరణతో పాటు ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. యాపిల్, స్ట్రాబెరీ నుంచి అరటి, అవకాడో, కివీ, ఖర్జూరం వరకు వివిధ రకాల ఉద్యాన పంటలకు ప్రోత్సహం అందించనున్ననట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రిటెక్, లాజిస్టిక్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాలను అభివృద్ధి చేసి రైతులకు మేలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. సీడ్ టు షిప్‌మెంట్ వ్యవస్థల ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించేలా కార్యక్రమాలను అమలు చేయనున్నామని సీఎం వెల్లడించారు.

**సాగునీరందిస్తాం... బంగారం పండించండి :** సాగునీరు అందిస్తే రాయలసీమ ప్రజలు బంగారం పండిస్తారని, మార్కెటింగ్ ద్వారా సంపద సృష్టిస్తారని సీఎం పేర్కొన్నారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి తదితర సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని, రూ. 3,500 కోట్లతో హంద్రీ-నీవా కాలువను పూర్తి చేసి కుప్పం వరకు నీటిని తీసుకెళ్లామని చెప్పారు. వెలిగొండ మొదటి దశను పూర్తి చేసి మార్కాపురానికి, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటిని అందించామని వివరించారు. మరో రూ. 35 వేల కోట్లతో 36 ప్రాధాన్య ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం తెలిపారు. రాయలసీమలో హంద్రీ-నీవా, మడకశిర బ్రాంచ్ కెనాల్, మల్లెమడుగు, బాలాజీసాగర్, అప్పర్ పేరూరు తదితర ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంలో సవాళ్లు పెరుగుతున్నాయని సీఎం అన్నారు. గోదావరిలో ఈ ఏడాది కూడా సుమారు 1,600 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని, పట్టిసీమ ద్వారా పదేళ్లలో సుమారు 500 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు తరలించామని తెలిపారు. కృష్ణా డెల్టాలో పొదుపు చేసిన నీటిని రాయలసీమకు తరలించడం నదుల అనుసంధానం వల్లే సాధ్యమైందన్నారు. వచ్చే ఏడాది పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని సీఎం తెలిపారు. పవర్ గ్రిడ్, రోడ్ గ్రిడ్, డిజిటల్ కనెక్టివిటీ మాదిరిగా వాటర్ గ్రిడ్ అవసరమని చెప్పారు. గోదావరి నుంచి కావేరి వరకు నీటిని అనుసంధానం చేసే అంశాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గోదావరి-కావేరి అనుసంధానంతో రాయలసీమ కరవు తీరడంతోపాటు... దక్షిణాదిలోని 4 రాష్ట్రాల మధ్య నెలకొనే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. రిలయన్స్ సంస్థ సహకారంతో మదనపల్లెలో ఏర్పాటు కానున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ద్వారా వ్యవసాయం, ఉద్యానవనం, ఆధునిక సాంకేతికత, పరిశోధన, కృత్రిమ మేధ వంటి రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించేలా ఈ సంస్థను తీర్చిదిద్దనున్నట్టు వెల్లడించారు. ఐఐఎంలో మేనేజ్‌మెంట్ నిపుణులు, ఐఐటీలో సాంకేతిక నిపుణులు, ఐఎస్‌బీలో పారిశ్రామిక నైపుణ్యాలు అభివృద్ధి చెందినట్లే.. ఐఎస్ఏ ద్వారా వ్యవసాయ రంగంలో నాయకత్వ నైపుణ్యాలు కలిగిన నిపుణులను తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు.

**ఉక్కు మహిళ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రానికి, దేశ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అందిస్తున్న సహకారాన్ని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం తదితర ప్రాజెక్టులకు కేంద్రం సహకరిస్తోందన్నారు. దేశ నిర్మాణంలో నిర్మలా సీతారామన్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ నెక్స్ట్‌జెన్ సంస్కరణలు, డీబీటీ ద్వారా సంక్షేమ పథకాల్లో పారదర్శకత, ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల ద్వారా దేశాన్ని బలోపేతం చేస్తున్న ఉక్కు మహిళ నిర్మలా సీతారామన్ అని సీఎం అన్నారు. ఓ మహిళే ఇంటిని చక్కగా తీర్చిదిద్దే సత్తా మహిళకు మాత్రమే ఉంటుందని.. అదే విధంగా దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మలా సీతారామన్ తీర్చిదిద్దుతున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆమెకున్న నాయకత్వ పటిమను గుర్తించే ప్రధాని మోదీ ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారన్నారు.

గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు నిధులు కేటాయించే విషయంలో నిర్మలా సీతారామన్ చూపిన చొరవను.. ఇచ్చిన సహకారాన్ని మరువలేమన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థాయిలో అభివృద్ధి-సంక్షేమం చేయగలుగుతోందంటే దానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన రిలయెన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తన పెద్ద మనస్సును చాటుకున్నారన్నారు. వ్యవసాయం, ఉద్యాన రంగాల్లో పరిశోధన, ఆధునిక సాంకేతికత, ఏఐ వినియోగంతో పాటు రైతులకు అవసరమైన మద్దతు వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో రిలయన్స్ సంస్థ సహకారం అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. సీడ్ టు షిప్‌మెంట్, అగ్రిటెక్, లాజిస్టిక్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో మరింతగా భాగస్వామ్యం కావాలని సూచించారు. తిరుమల శ్రీవారిపై భక్తితో ఈవీ బస్సులను సమకూర్చిన అనంత్ అంబానీ సేవలను సీఎం ప్రస్తావించారు. అలాగే అనంత్ అంబానీ వంతారా వంటి వ్యవస్థను ఏర్పాటు చేసి జంతువులకు సైతం సేవలు అందిస్తున్న గొప్ప పర్యావరణ ప్రేమికుడు అనంత్ అంబానీ అని కొనియాడారు. అనంత్ అంబానీ తన తాత, తండ్రుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని వారి బాటలో నడుస్తున్నారని సీఎం చంద్రబాబు చెప్పారు.

**ప్రత్యేక ఆకర్షణగా అనంత్ అంబానీ :** రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌తో తన అనుబంధాన్ని చాటుకుంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. తనను ఆంధ్రా బిడ్డగా భావించాలని, రాష్ట్రానికి తాను ఏం చేయగలనో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యక్రమంలో ఆయన ప్రసంగం ఆకట్టుకుంది. అనంత్ అంబానీ ప్రసంగం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆయనను అభినందించారు. అనంతరం సీఎం చంద్రబాబు అనంత్ అంబానీని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత ప్రసంగించిన ముఖ్యమంత్రి అనంత్ అంబానీ చెప్పిన మాటలను స్పందించారు. అనంత్ అంబానీని ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డగా భావిస్తున్నామని సీఎం వేదికపై ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ సంస్థ మరింతగా భాగస్వామి కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశం సందర్భంగా సభలో వక్తల ప్రసంగాలకు ముందు ప్రత్యేక వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి, రైతుల ఆదాయ పెంపు, నీటి వనరుల వినియోగం, ఆధునిక సాగు విధానాలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతుల అవకాశాలను ఈ వీడియోలో వివరించారు. కార్యక్రమం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మొక్కలను నాటారు. అలాగే ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, అన్నమయ్య జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రైతులే రేపటి సీఈవోలు కావాలి

(మొదటి పేజీ తరువాయి)



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితరుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

రాయలసీమ వ్యవసాయ రంగంలో మార్పునకు నాంది పలికే ఈ ప్రాజెక్టులో రిలయన్స్ భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని అనంత్ అంబానీ పేర్కొన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు రిలయన్స్ పూర్తి సహకారం అందిస్తుందని ప్రకటించారు. రైతుల ఆదాయం, ఉత్పాదకత పెంచడంతోపాటు ఆధునిక వ్యవసాయ విధానాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు ఐఎస్ఏ వేదికగా పనిచేస్తుందని చెప్పారు.

వ్యవసాయ దిగుబడులను పెంచి రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావాలని తన తాత, పారిశ్రామికవేత్త ధీరూభాయ్ అంబానీ పాతికేళ్ల క్రితమే ఆకాంక్షించారని గుర్తుచేశారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు ద్వారా ఆయన కల సాకారమవుతోందని భావిస్తున్నట్లు తెలిపారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, మార్కెట్ అవకాశాలు అందించేందుకు ఐఎస్ఏ ద్వారా రిలయన్స్ నాలుగు ఆచరణాత్మక మార్గాల్లో పనిచేస్తుందని వివరించారు.

వ్యవసాయాన్ని యువత గౌరవప్రదమైన వృత్తిగా ఎంచుకునే పరిస్థితులను సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. యువత స్వచ్ఛందంగా సాగువైపు అడుగులు వేసి, 'నేనూ రైతునే' అని గర్వంగా చెప్పుకునే వాతావరణాన్ని ఐఎస్ఏ నిర్మించాలని ఆకాంక్షించారు. గ్రీన్‌హౌస్ టెక్నాలజీతోపాటు ఆధునిక వ్యవసాయ సాంకేతికత రైతుల ఉత్పాదకతను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

'జై జవాన్, జై కిసాన్' నినాదానికి కాలక్రమంలో 'జై విజ్ఞాన్', 'జై అనుసంధాన్' జతయ్యాయని అనంత్ అంబానీ గుర్తుచేశారు. వ్యవసాయం, విజ్ఞానం, పరిశోధనలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా దేశంలో కొత్త ఆవిష్కరణలకు మరింత అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత, రైతుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

2024 తర్వాత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని, ఆ ప్రయాణంలో రిలయన్స్ భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని అనంత్ అంబానీ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి రిలయన్స్ నుంచి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తనను 'ఆంధ్ర బిడ్డ'గా భావించి రాష్ట్రానికి ఏ విధంగా సేవ చేయాలో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు.

దేశ ఆర్థికాభివృద్ధికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేపడుతున్న కార్యక్రమాలను, గ్రామీణ వ్యవస్థలు, పంచాయతీల బలోపేతానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషిని అనంత్ అంబానీ ప్రస్తావించారు. గాంధీ జయంతి సందర్భంగా మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన జరగడం ప్రత్యేకతను సంతరించుకుందని అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను 'స్వర్ణభూమి'గా తీర్చిదిద్దే అభివృద్ధి ప్రయాణంలో రైతులు, యువత, పరిశోధకులు, పారిశ్రామిక సంస్థలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో సరికొత్త పరిశోధనలు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అనుసంధానం ద్వారా రైతులకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అనంత్ అంబానీ పేర్కొన్నారు.

## ఎస్‌హెచ్‌జీ రుణాల్లో ఏపీ నంబర్ వన్



**అమరావతి, అక్టోబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలతో స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ కార్యక్రమం మరింత బలోపేతమవుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎన్ఆర్ఎల్ఎం తాజా గణాంకాల ప్రకారం సెప్టెంబర్ 15 నాటికి రాష్ట్రంలో రూ. 15,229.40 కోట్ల రుణాలు పంపిణీ చేయగా, రూ. 82,639.56 కోట్ల రుణ నిల్వతో దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందన్నారు.

ఆధార్ బయోమెట్రిక్ ప్రమాణీకరణ, సభ్యుల గుర్తింపు ధృవీకరణ, విశిష్ట రిజిస్ట్రేషన్ నంబర్ విధానం ద్వారా నకిలీ సభ్యత్వాలు, నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేస్తున్నామని మంత్రి తెలిపారు. రియల్‌టైమ్ డాష్‌బోర్డుల ద్వారా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్స్, గ్రేడింగ్, రుణ వివరాలను పరిశీలించే అవకాశం కల్పించామని, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంక్ సఖీల ద్వారా మహిళలకు డిజిటల్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్, సర్వీస్ ఛార్జీల తగ్గింపుతో ఒక్కో సంఘానికి ఏటా రూ. 32,500 వరకు ఆదా అవుతోందని తెలిపారు. గతంలో 7 నుంచి 14.50 శాతం వం-కు ఉన్న వడ్డీ రేట్లను 7 నుంచి 11.70 శాతం పరిధికి తగ్గించడం ద్వారా రుణ భారం తగ్గిందన్నారు. వ్యవసాయం, పశుపోషణ, సూక్ష్మ పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తూ వార్షిక క్రెడిట్ జీవనోపాధి ప్రణాళిక, మైక్రో క్రెడిట్ ప్లాన్ ద్వారా రుణ సౌకర్యాలు కల్పిస్తున్నామని, హామీ లేని రుణ పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచినట్లు చెప్పారు.

2024-25లో రూ. 32,190 కోట్ల లక్ష్యానికి రూ. 30,079 కోట్లు పంపిణీ చేసి 93 శాతం సాధించామని, 2025-26లో 99 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని మంత్రి తెలిపారు. 2026-27లో సెప్టెంబర్ నాటికి రూ. 19,655 కోట్ల లక్ష్యానికి రూ. 15,229 కోట్లు పంపిణీ చేసి 78 శాతం సాధించినట్లు పేర్కొన్నారు. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో 90 శాతానికి పైగా లక్ష్యాలను సాధించామని, బ్యాంకులు, సెర్ప్, ఎస్‌హెచ్‌జీ సమాఖ్యల సమన్వయంతో ప్రస్తుత లక్ష్యాన్ని కూడా చేరుకుంటామని తెలిపారు.

మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం, ప్రతి కుటుంబానికి స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత పురోగతి పథంలో నడిపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# రైతులకు కేంద్రం అండ

(మొదటి పేజీ తరువాయి)



పాటు కేంద్ర ప్రభుత్వం కూడా అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. రైతులు తమకు లభిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు.

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి నిర్మలా సీతారామన్ రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేశారు. అదే కార్యక్రమంలో దేశంలోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు కూడా పునాది వేశారు.

ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ గాంధీ జయంతి రోజున రాయలసీమకు భవిష్యత్తును మార్చగల రెండు కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం విశేషమన్నారు. లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు కానున్న హార్టికల్చర్ హబ్ రాయలసీమతో పాటు దేశ వ్యవసాయ రంగానికే ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టుగా నిలుస్తుందని చెప్పారు. మదనపల్లెలో ఇలాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన పారిశ్రామికవేత్త అనంత్ అంబానీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి అందించేందుకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని నిర్మలా సీతారామన్ వివరించారు. యూరియా కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఒక్కో యూరియా బస్తాకు రూ. 300కు మించి వసూలు చేయకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పంట నష్టపోయే రైతులకు అండగా నిలిచేందుకు కిసాన్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో పశువుల వ్యర్థాలను వినియోగించి బయోగ్యాస్ ఉత్పత్తి చేసే విధంగా గోవర్ధన్ పథకం ద్వారా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల ద్వారా సోలార్ పంపులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని, వాటి ద్వారా రైతులకు తక్కువ వ్యయంతో విద్యుత్ సదుపాయం కల్పించే చర్యలు చేపడుతున్నామని వివరించారు.

మత్స్యకారులు, పశుపోషకుల సంక్షేమం కోసం కేంద్రం కొత్త పథకాలను అమలు చేస్తోందని నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రతి జిల్లాలో పశువుల ఆరోగ్య సంరక్షణకు వెటర్నరీ వైద్యుడితో పాటు మొబైల్ యానిమల్ ఆస్పత్రుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కోడలిగా వచ్చిన తనకు రాష్ట్రంపై వ్యక్తిగతంగా ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడేందుకు తనకు ఎప్పుడూ ఆసక్తి ఉంటుందని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి అనంత్ అంబానీ ముందుకు రావడం అభినందనీయమని నిర్మలా సీతారామన్ అన్నారు. తనను ఆంధ్రాబిడ్డగా భావించి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరడం సంతోషం కలిగించిందన్నారు.

కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, పారిశ్రామికవేత్త అనంత్ అంబానీ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు




**రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి మంచి అవకాశాలున్నాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం జె.ఎన్. రోడ్డులోని చెరుకూరి వీర్రాజు, సుబ్బలక్ష్మి కన్వెన్షన్ సెంటర్‌లో అక్టోబర్ 2 నుంచి 4 వరకు నిర్వహిస్తున్న 'క్రెడాయ్ హోమ్ ఎక్స్‌పో'ను మంత్రి సందర్శించి వివిధ నిర్మాణ రంగ స్టాళ్లను పరిశీలించారు. భవన నిర్మాణ రంగానికి సంబంధించి ప్రభుత్వం నుంచి మరింత సరళీకృత విధానాలు అమలయ్యేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఆరు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఎక్స్‌పో నిర్వహించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. 130 స్టాళ్లతో ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద ఎక్స్‌పోగా ఇది నిలిచిందని, దీనివల్ల గృహ నిర్మాణ రంగంపై ప్రజల్లో ఆసక్తి పెరగడంతో పాటు క్రెడాయ్‌పై నమ్మకం బలపడుతుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భవన నిర్మాణ, పర్యాటక రంగాలకు అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పిలిగ్రిమ్, ఎకో టూరిజం రంగాలు విస్తరిస్తున్నాయని, దీనికి అనుగుణంగా రియల్ ఎస్టేట్ రంగం కూడా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని వివరించారు.

రాజమహేంద్రవరం ప్రజలు ఎక్స్‌పోను సందర్శించి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్రెడాయ్ రాష్ట్ర ఛైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్, రాజమహేంద్రవరం చాప్టర్ ఛైర్మన్ సూరవరపు శ్రీనివాసరావు, అధ్యక్షుడు మన్యం సంతోష్ ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి చల్లా బాల మురళీకృష్ణ, ఇతర క్రెడాయ్ సభ్యులు పాల్గొన్నారు. బృహత్ ప్రదర్శనను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను మంత్రి అభినందించారు.

# ఒక్క మొక్కతో పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌లో ఎన్డీయే కూటమి నాయకులతో కలిసి ఆమె 60 మొక్కలు నాటారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలనే లక్ష్యంతో మొక్కలు నాటినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ కమిటీ అధ్యక్షుడు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. చైతన్య గ్రామీణ బ్యాంకు సౌజన్యంతో మొక్కలు అందించినందుకు ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. నాటిన 60 మొక్కలను పెద్ద చెట్లుగా ఎదిగే వరకు సంరక్షిస్తామని కమిటీ సభ్యులు హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు.

మొక్కలు నాటడం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని గళ్ళా మాధవి సూచించారు. పుట్టినరోజులు, శుభకార్యాలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు ధన్యవాదాలు తెలిపిన దారపనేని, చెనికల



**కనిగిరి(జర్నలిస్ట్ ఫైల్):** పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామ రహదారి నిర్మాణానికి రూ. 2.40 కోట్ల నిధులు మంజూరు చేసి, పనులను ప్రారంభించిన కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి మాజీ ఏఎంసీ ఛైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పోతవరం టీడీపీ నాయకుడు చెనికల చిన్న మాలకొండయ్య ధన్యవాదాలు తెలిపారు. సుదీర్ఘకాలంగా నిరుపయోగంగా ఉన్న రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడమే కాకుండా శంకుస్థాపన జరిగిన వెంటనే పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించడం అభినందనీయమన్నారు.

తూర్పు కోడిగుడ్లపాడు గ్రామ ప్రజలకు రహదారి నిర్మాణంతో ఎంతో ప్రయోజనం కలుగుతుందని టీడీపీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి గ్రామ ప్రజలు జీవితాంతం రుణపడి ఉంటారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తూర్పు కోడిగుడ్లపాడు ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను గెలిపించి ఎమ్మెల్యేకు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దారపనేని రాజేంద్రప్రసాద్, మానం మల్లికార్జున యాదవ్, మిరియం సుబ్బరాయుడు, మిరియం గురువయ్య, గడిపూటి వెంకటేశ్వరరావు, తిరివీధి చంద్ర, తిరివీధి హజరత్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య శాఖ మంత్రి ఆగ్రహం...
# 70 మంది వైద్యులకు ఉద్వాసన



● సుదీర్ఘకాలంగా అనధికార విధుల గైర్హాజరీ వైద్యులపై ప్రభుత్వ కొరడా ● వివిధ దశల్లో మరో 193 మందిపై చర్యలు ● వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు నివేదిక అందజేసిన డీఎస్‌హెచ్, డీఎంఈ అధికారులు ● గత మే నెలలోనే డిఎంఈ పరిధిలో 51 మంది వైద్యుల తొలగింపు

● ఉపేక్షించొద్దని అధికారులకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** సుదీర్ఘకాలంగా విధులకు గైర్హాజరీలో ఉన్న 70 మంది వైద్యులను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్) తొలగించింది. ఏడాదికిపైగా అనధికారికంగా విధులకు గైర్హాజరీలో ఉన్న వీరికి ప్రభుత్వ సివిల్ సర్వీసు నిబంధనల ప్రకారం సంజాయిషీ నోటీసులు జారీ చేసి, ఇతర నిబంధనలను అనుసరించి చివరి చర్యగా విధుల నుంచి తప్పించాలని శాఖాపరంగా నిర్ణయించినట్లు అధికారులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు. రూల్ నంబర్ 20 ఆఫ్ ఏపీసీఎస్ (సీసీఏ) రూల్స్-1991 అనుసరించి వీరిపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ హోదాలో ఉన్న వీరిలో గైనిక్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, ఇతర స్పెషాల్టీ వైద్యులు ఉన్నారని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు తెలిపారు.

**మరో 154 మందిపై చర్యలు వివిధ దశల్లో :** డీఎస్‌హెచ్ పరిధిలోనే మరో 154 మంది వైద్యులు అనధికారికంగా విధులకు గైర్హాజరీలో ఉన్నారు. వీరి విషయంలోనూ నిబంధనలను అనుసరించి సంజాయిషీ నోటీసులను జారీ చేశారు. తదుపరి చర్యలు వివిధ దశల్లో ఉన్నాయి. నోటీసుల అనంతరం విధుల్లో చేరేందుకు ముందుకొస్తే ఇంక్రిమెంట్లలో కోత వంటి క్రమశిక్షణా చర్యలను అనుసరించి అవకాశాలను కల్పిస్తున్నారు. ఇలా డీఎస్‌హెచ్ పరిధిలో అంతకుముందు 78 మంది వైద్యులు విధుల్లో చేరారు.

**విధులకు గైర్హాజరీలో ఉన్న 39 మంది వైద్యులకు (డీఎంఈ పరిధిలో) తుది అవకాశం :** డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో పనిచేస్తూ విధులకు హాజరుకాని 39 మంది వైద్యులకు ప్రభుత్వం తుది అవకాశం కల్పించింది. ఎలాంటి అనుమతి లేకుండా ఏడాదికి పైగా, రెండేళ్లలోపు కాలంగా విధులకు గైర్హాజరవుతున్న వీరికి ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించలేదు. విధుల్లోనూ చేరలేదు. సర్వీస్ నిబంధనలను అనుసరించి వీరికి తుదిగా అవకాశం కల్పిస్తామని, స్పందన లేకుంటే విధుల నుంచి తప్పిస్తామని డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. గైర్హాజరైన 39 మంది వైద్యుల్లో ఐదుగురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 30 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. సంబంధిత అధికారులు మంజూరు చేసిన సెలవులు లేకుండానే వీరు విధులకు దూరంగా ఉన్నారు. గత మే నెలలో డీఎంఈ పరిధిలో 51 మంది వైద్యుల్ని విధుల నుంచి శాశ్వతంగా తప్పించారు.

**ప్రైవేట్ ప్రాక్టీస్, పోస్టింగ్‌లు నచ్చక విధులకు దూరం :** వైద్యులు విధుల్లో చేరిన తర్వాత ప్రైవేట్ ప్రాక్టీస్, పోస్టింగ్‌లు నచ్చక, ఆరోగ్య, కుటుంబ, ఇతర సమస్యల కారణంగా విధులకు దూరంగా ఉంటున్నారు.

**గైర్హాజరీలు మొత్తం 493 మంది :** గైర్హాజరీల విషయంలో ఎటువంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, నిబంధనల ప్రకారం విధుల నుంచి తప్పించాలని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ సదరు హెచ్‌ఓడీ అధికారులకు ఇటీవల స్పష్టమైన ఆదేశాలిచ్చారు. నిర్దిష్టమైన ప్రమాణాలను అనుసరించి గైర్హాజరీలో ఉన్నవారిని విధుల నుంచి తప్పించే ప్రక్రియను గరిష్టంగా 3 నెలల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అనవసరంగా నాన్చుడి ధోరణి అవలంబించొద్దని కూడా స్పష్టంగా చెప్పారు. అంతేకాకుండా అవసరాలకు అనుగుణంగా ఆ పోస్టులను కూడా "జీరో వేకెన్సీ పాలసీ" కింద భర్తీ చేయాలని అధికారులకు దిశా, నిర్దేశం చేశారు. ఇందులో భాగంగానే డీఎంఈ, డీఎస్‌హెచ్, ఇతర శాఖల అధికారులు వైద్యులను విధుల నుంచి తప్పించే చర్యలు చేపట్టారు.

**హెచ్‌ఓడి కార్యాలయాల వారీగా :** వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని అన్ని హెచ్‌ఓడీ కార్యాలయాల పరిధిలో కలిపి ఇటీవల తేల్చిన లెక్కల ప్రకారం 493 మంది వైద్యులు, ఇతర సిబ్బంది విధులకు దూరంగా ఉన్నట్లు గుర్తించారు. డీఎస్‌హెచ్, డీఎంఈ పరిధిలోని వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఎన్‌హెచ్‌ఎం (ఒప్పంద), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఆయుష్, ఔషధ నియంత్రణ పరిపాలనా శాఖ, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో కొందరు గైర్హాజరీలో ఉన్నారు. ఈ 493 మంది గైరాజరీలపై సర్వీసు నిబంధనలు, క్రమశిక్షణ చర్యలు అనుసరించి తొలగింపుల వంటి ప్రక్రియను చేపట్టినట్లు మంత్రికి అధికారులు వివరించారు.

# స్వచ్ఛత.. ప్రజా ఉద్యమం కావాలి

**విజయవాడ, అక్టోబర్ 2 (జర్నలిస్ట్ ఫైల్) :** స్వచ్ఛత ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ఐదు కోట్ల మంది ప్రజలు భాగస్వాములై ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగితేనే రాష్ట్రంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డ్స్-2026 కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వచ్ఛతా వారియర్లు, స్వచ్ఛ గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, సంస్థలకు అవార్డులు అందజేశారు.

కృష్ణా, గోదావరి నదుల్లోకి వ్యర్థాలు, మురుగునీరు వదలకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సీఎం సూచించారు. నదుల కాలుష్యం పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి నీరు అందించడంతో పాటు మురుగునీటి శుద్ధికి రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీపీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యాంధ్ర సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

చెత్తను సమస్యగా కాకుండా సంపద సృష్టించే వనరుగా మార్చుతున్నామని చంద్రబాబు తెలిపారు. వ్యర్థాలతో విద్యుత్తు, ఎరువులు, బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తూ సర్క్యులర్ ఎకానమీ దిశగా రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నామని చెప్పారు. జీరో గార్బేజ్ లక్ష్యంతో స్వచ్ఛ రథాలు, ఈ--ఆటోలు, పుష్‌కార్టులు, మెకనైజ్డ్ రోడ్ స్వీపింగ్ యంత్రాలు, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.




వచ్చే ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.30 లక్షల కోట్లు ఖర్చు చేయాలని ప్రణాళిక రూపొందించామని సీఎం తెలిపారు. రాయలసీమను రూ.లక్ష కోట్ల పెట్టుబడితో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. పరిశుభ్రతతో పాటు పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని పెంచుతూ రాష్ట్రాన్ని హరిత ప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

స్వచ్ఛ చల్లపల్లిని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛతా కార్యక్రమాలను విస్తరించాలని చంద్రబాబు సూచించారు. ప్రతి ఏడాది అక్టోబర్ 2న స్వచ్ఛత, నెట్‌జీరో రంగాల్లో కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు అవార్డులు అందించే కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ పరంగా 22 విభాగాల్లో 130 రాష్ట్రస్థాయి, 2,044 జిల్లా స్థాయి అవార్డులు అందిస్తున్నామని తెలిపారు. పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల సేవలను కూడా గుర్తిస్తున్నట్లు చెప్పారు.

స్వచ్ఛాంధ్ర--2026 అవార్డుల్లో భాగంగా స్వచ్ఛ కాలనీలు, అసోసియేషన్లు, హోటళ్లు, రైతు బజార్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయాలు, వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సంస్థలకు అవార్డులు అందజేశారు. నోవోటెల్ విశాఖ, తెనాలి, చిలకలూరిపేట, మంగళగిరి, పొన్నూరు తదితర మున్సిపాలిటీలు, నంబూరు సహా పలు గ్రామ పంచాయతీలు, వివిధ పాఠశాలలు, ఆస్పత్రులు, తిరుమల తిరుపతి ఆలయం, దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం, సింహాచలం ఆలయాలకు అవార్డులు లభించాయి.

కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్వచ్ఛతా అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను ముఖ్యమంత్రి తిలకించారు. ప్రతి పాఠశాల, పంచాయతీ, మున్సిపాలిటీకి స్వచ్ఛత ర్యాంకులు ఇచ్చేలా కార్యాచరణ రూపొందిస్తామని, ప్రజాభిప్రాయాన్ని తీసుకుని మరింత మెరుగైన విధానాలను అమలు చేస్తామని తెలిపారు.

(మొదటి పేజీ తరువాయి)

పంటకు గిట్టుబాటు ధర, అదనపు విలువ లభించేలా ఆధునిక కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పంట ఉత్పత్తి నుంచి నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్ వరకు సమగ్ర వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి రాయలసీమ రైతుల ఉత్పత్తులను దేశీయ మార్కెట్‌తోపాటు ప్రపంచ మార్కెట్‌కు చేరేలా చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు.

# కరవు సీమ కాదు.. అభివృద్ధి సీమ

శుక్రవారం మదనపల్లెలో రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన మహోత్సవంలో కేంద్ర మంత్రి నిర్మాల సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "రాయలసీమ గొప్ప చరిత్రకు, ప్రత్యేకమైన సంస్కృతికి, ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచిన నేల. శ్రీకృష్ణదేవరాయలు పాలించిన ఈ ప్రాంతం ఒకప్పుడు అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంది. ఫ్యాక్షన్ రాజకీయాల ప్రభావంతో అశాంతికి గురైన సందర్భాలు ఉన్నాయి. అభివృద్ధికి ప్రతీకగా నిలవాల్సిన ప్రాంతంలో పచ్చని చెట్లను సైతం నరికి వేసిన పరిస్థితులు చూశారు. ఆ పరిస్థితుల నుంచి రాయలసీమను బయటకు తీసుకువచ్చి, అభివృద్ధి బాటలో నడిపించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేశారు. 2024లో మీరు అందించిన ప్రజా తీర్పు ఈ మార్పుకు మరింత బలాన్ని ఇచ్చింది. ప్రజలు ఇచ్చిన ఆ విజయంతోనే ఈ రోజు రాయలసీమలో రూ. 1 లక్ష కోట్ల పెట్టుబడులతో అభివృద్ధి కార్యక్రమాలకు బాటలు పడ్డాయి.

**రెండేళ్లలో రూ.8 వేల కోట్ల అభివృద్ధి పనులు :** పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రాయలసీమలో గత 2 ఏళ్లలో రూ. 8 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టాం. అందులో భాగంగా రాష్ట్రంలో 2 లక్షల ఎకరాల్లో, అందులో రాయలసీమ ప్రాంతాన 62 వేల ఎకరాల్లో 28 వేల మంది రైతులకు లబ్ధి చేకూరేలా ఉద్యాన పంటల సాగును విస్తరించాం. నీటి సంరక్షణలో భాగంగా దాదాపు 70 వేల ఫామ్ పాండ్లను నిర్మించి, అదనంగా 50 వేల ఎకరాల భూమిని సాగులోకి తీసుకొచ్చాం. రూ. 4,500 కోట్లకు పైగా నిధులతో 23 వేలకు పైగా రహదారి పనులను చేపట్టి, 5 వేల కిలోమీటర్లకు పైగా రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేశాం. ఉపాధి హామీ నిధులతో ప్రాజెక్ట్ జలధార ద్వారా నీటి సంరక్షణ చర్యలను బలోపేతం చేస్తూ, రాయలసీమను నీటి భద్రత ప్రాంతంగా తీర్చిదిద్దే దిశగా ఎన్నో చర్యల చేపట్టాం. తద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలమట్టాలు సగటున 3.6 మీటర్లు పెరిగాయి.



**45 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ యాపిల్ సాగు :** రాయలసీమ రైతుల పట్టుదలకు ఉద్యాన సాగులో వస్తున్న మార్పులే నిదర్శనం. సాధారణంగా యాపిల్ సాగుకు అనుకూలంగా భావించని 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అనంతపురం ప్రాంతంలోనూ కూడా కె.ఎల్.డి. యాపిల్ సాగు సాధ్యమైంది. రాయలసీమలో మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, నిమ్మ, స్వీట్ ఆరెంజ్ తోపాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆపిల్, బెర్రీస్ వంటి అధిక విలువ కలిగిన పంటలను కూడా సాగు చేస్తున్నారు. మదనపల్లె ఆసియాలోనే అతి పెద్ద టమాటా సాగు ప్రాంతాల్లో ఒకటిగా ఉంది. రాయలసీమలో ఉద్యాన పంటలకు ఉన్న అపారమైన సామర్థ్యానికి ఇది నిదర్శనం.

**మూడు దశల్లో రూ. లక్ష కోట్ల ప్రణాళిక :** ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్ కింద రూ. 40 వేల కోట్ల ప్రభుత్వ పెట్టుబడితో పాటు, రూ. 60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షిస్తూ, రాబోయే 3 సంవత్సరాల్లో 3 దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయబోతున్నాం. రాయలసీమతో ఎల్ పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాలను కలుపుకుని మొత్తం 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లలో ఈ ప్రణాళిక అమలు కానుంది. సాగునీటి కోసం రూ. 21 వేల కోట్లతో రిజర్వాయర్లు, కాలువలు, చెరువులను అభివృద్ధి చేసి 9 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించడంతోపాటు 4.3 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరిస్తున్నాం. 6.5 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ ను విస్తరిస్తున్నాం. మరో రూ. 15 వేల కోట్లతో 6 లక్షల హెక్టార్లలో ఉద్యానవన సాగును విస్తరించి, ప్రస్తుతం ఉన్న 8.4 లక్షల హెక్టార్ల ఉద్యాన విస్తీర్ణాన్ని 14.41 లక్షల హెక్టార్లకు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నాం. సుమారు రూ. 4, 500 కోట్లతో దాదాపు 6 వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నాం.

**రైతు పొలం నుంచి ప్రపంచ మార్కెట్ వరకు :** రైతు పండించిన పంటకు సరైన విలువ లభించేలా కోల్డ్ స్టోరేజీలు, ప్యాక్‌హౌస్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వాల్యూ అడిషన్ సెంటర్లు, ఎగుమతి మౌలిక వసతులను ఉద్యానవన క్లస్టర్లతో అనుసంధానం చేయబోతున్నాం. పంట ఉత్పత్తి నుంచి నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్, ఎగుమతుల వరకు పూర్తి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. ఈ మౌలిక వసతుల ద్వారా 40 నుంచి 45 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని నష్టపోకుండా కాపాడుకునే అవకాశం ఉంటుంది. మూడో సంవత్సరం నుంచి సుమారు రూ. 81 వేల కోట్ల అదనపు గ్రాస్ వ్యాల్యూ అడిషన్‌తో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 50 లక్షల ఉద్యోగ అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

**మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ :** మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేశాం. ఈ సంస్థ రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంతో పాటు డిజిటల్ అగ్రికల్చర్, ప్రిసిషన్ ఫార్మింగ్, క్రాప్ మానిటరింగ్, స్మార్ట్ ఇరిగేషన్, మార్కెట్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక విధానాలను వ్యవసాయ రంగంతో అనుసంధానం చేయడంలో ఈ సంస్థ కీలకంగా ఉంటుంది. ఈ ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య కార్యక్రమంలో భాగస్వామిగా ముందుకు వచ్చినందుకు, మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు మద్దతు అందించినందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీకి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

**జల్ జీవన్ మిషన్‌కు కేంద్ర సహకారం :** గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయిన జల్ జీవన్ మిషన్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరిగి కొనసాగించాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నేను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే, సానుకూలంగా స్పందించి 2028 డిసెంబర్ వరకు పొడిగించి, సుమారు రూ. 30 వేల కోట్లతో జల్ జీవన్ మిషన్ ను ముందుకు తీసుకెళ్లేందుకు సహకరించిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రాయలసీమను ఇకపై గతంలో ఎదుర్కొన్న కరువులతో కాదు.. సీమ సాధిస్తున్న అభివృద్ధితో, సృష్టిస్తున్న విలువతో, కల్పిస్తున్న అవకాశాలతో, ప్రపంచ మార్కెట్లకు చేరుతున్న తన సామర్థ్యంతో గుర్తించబడేలా తీర్చిదిద్దుదాం. రాయలసీమను ప్రపంచ అవకాశాలకు కేంద్రంగా నిలబెడతాం" అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ ముఖేష్ అంబానీ, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తోపాటు కూటమి పార్టీలకు చెందిన శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, రాష్ట్రస్థాయి ఛైర్మన్లు పాల్గొన్నారు.

## డాక్టర్ ఏ.ఎస్.రామకృష్ణ గెలుపుకు కృషి చేయాలి



- మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ శాసన మండలి అభ్యర్థి డాక్టర్ ఏ.ఎస్. రామకృష్ణకు మద్దతుగా ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు పిలుపునిచ్చారు. మంగళగిరి ఆత్మకూరులో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉపాధ్యాయుల సమస్యలు, ఆకాంక్షలను తెలుసుకుంటూ ఏ.ఎస్. రామకృష్ణ నిరంతరం వారితో సంబంధాలు కొనసాగిస్తున్నారని అశోక్ బాబు తెలిపారు. ఉపాధ్యాయులంతా ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సంఘాల ప్రతినిధులకు సూచించారు.

ఓటరు నమోదు కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఏ.ఎస్. రామకృష్ణ కోరారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, చివరి వరకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయుల భాగస్వామ్యం, క్షేత్రస్థాయి పర్యవేక్షణతో ఎన్నికల కార్యాచరణను బలోపేతం చేయాలని అన్నారు.

ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ, ఓటరు నమోదు, సమష్టి కృషితో ముందుకు సాగాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇదే ఉత్సాహంతో కృషి కొనసాగించాలని కోరారు.

సమావేశంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు, నాయకులు మధుసూదనరావు, సూర్యదేవర శ్రీనివాసరావుతో పాటు 25 ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్‌ను అడ్డుకునేందుకు జగన్ కుట్రలు



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చట్టబద్ధమైన మార్గంలో పోరాటం కొనసాగిస్తోందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ 34 శాతం రిజర్వేషన్లను సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో హైకోర్టు తీర్పును గౌరవిస్తూనే తదుపరి న్యాయపరమైన చర్యల్లో భాగంగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే చట్ట సవరణ కోసం కూడా నిర్దిష్ట ప్రక్రియలో ముందుకు వెళ్తామని చెప్పారు.

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో టీడీపీకి స్పష్టమైన విధానం ఉందని గళ్ళా మాధవి అన్నారు. ఎన్టీఆర్ హయాంలోనే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించారని, అనంతరం చంద్రబాబు నాయకత్వంలో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం మరింత పెరిగిందని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గించడంతో బీసీలకు రాజకీయ అవకాశాలు తగ్గాయని ఆమె ఆరోపించారు. బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో గత, ప్రస్తుత ప్రభుత్వాల చర్యలను ప్రజలు పరిశీలించాలని సూచించారు.

బీసీల రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని గళ్ళా మాధవి కోరారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న న్యాయపరమైన ప్రయత్నాలకు సహకరించాలని సూచించారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా ముందుకు రావడానికి అన్ని వర్గాల భాగస్వామ్యం అవసరమని, వారి హక్కులు, ప్రాతినిధ్యం, సంక్షేమం వంటి అంశాలపై రాజకీయాలకు అతీతంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు.

## ఈశ్వరీదేవి మఠం అభివృద్ధి 4 లక్షల విరాళం



- మఠాధిపతులు శ్రీ వీర శివకుమార్ స్వామి

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠంలో వెలసిన పరమేశ్వరి స్వరూపిణి శ్రీ ఈశ్వరీ మాత దివ్య మందిర పునఃనిర్మాణ మహత్కార్యమునకు నల్గొండ కు చెందిన కూరెళ్ళ భుజంగాచారి ధర్మపత్ని పిచ్చమ్మ వీరి కుమారుడు మదనాచారి ధర్మపత్ని కౌసల్య రాజశేఖర్ ధర్మపత్ని పావని గార్లు 1,11,116/- (ఒక లక్షా పదకొండు వేల నూటా పదహారు రూపాయలు) అలాగే నల్గొండకు చెందిన కొల్లోజు సత్యనారాయణాచారి ధర్మపత్ని తారకమ్మ వీరి కుమారులు శ్రీనివాసాచారి ధర్మపత్ని శ్రీమతి సరళ,చంద్రశేఖరాచారి ధర్మపత్ని హేమలత గార్లు 1,11,000 (ఒక లక్షా పదకొండు వేల)రూపాయలు, నల్గొండకు చెందిన గొట్టిముక్కల చంద్రశేఖర్ ధర్మపత్ని పద్మ ,వీరి కుమారుడు రఘు వంశీ ధర్మపత్ని స్వాతి గార్లు 1,01,000/- (ఒక లక్షా ఒక వెయ్యి) రూపాయలు.ఎన్టీ ఆర్ జిల్లా విజయవాడ వాస్తవ్యులు కోడూరు వీరబ్రహ్మం ధర్మపత్ని వాణీ కుమారి,వీరి కుమార్తె హేమనీల భర్త అశోక్ బాబు 1,00,116 (లక్షా నూట పదహారు) రూపాయలు చిరస్మరణీయమైన భక్తి విరాళమును మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర శివకుమార్ స్వాముల వారికి సమర్పించినారు.ఈ సందర్భంగా స్వామివారు విరాళ దాతలను వారి కుటుంబాలను ఆశీర్వదించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు.

# హార్టికల్చర్ హబ్‌తో సీమకు కొత్త రూపు

(మొదటి పేజీ తరువాయి)

మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలసి మంత్రి లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... విత్తనం దగ్గర నుండి, ఉత్పాదకత, కోల్డ్ స్టోరేజ్, ప్యాకేజింగ్, యాంత్రీకరణ, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ వరకు ఇక్కడ రీసెర్చ్ జరుగుతుంది. ఇక్కడ పండించిన పండ్ల ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేసినప్పుడే మన రైతులకు లాభం వస్తుంది. హార్టికల్చర్ హబ్ లక్ష్యం రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే. మనం కేవలం ఇతర రాష్ట్రాలకు కావాల్సిన వెరైటీలే కాకుండా ఇతర దేశాలకు అవసరమైన రకాల పంటలు కూడా పండించాలి. అందుకు అనుగుణంగా మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, పుచ్చకాయ, నిమ్మ, స్వీట్ ఆరెంజ్, అవకాడో, ఆపిల్, బెర్రీస్ వంటి ప్రతి వెరైటీకి సంబంధించి రీసెర్చ్ జరగాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

**పోరాటాల పుట్టినిల్లు మదనపల్లె :** త్యాగానికి, పోరాటానికి పుట్టినిల్లు మదనపల్లె. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో గాంధీజీ మదనపల్లెకు వచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే అత్యధిక విరాళాలు ఇచ్చింది మదనపల్లె ప్రజలు. బ్రిటిష్ వారి అరాచకానికి వ్యతిరేకంగా పోరాడి లాఠీ దెబ్బలు తిన్నది బీటీ కాలేజీ విద్యార్థులు. రవీంద్రనాథ్ ఠాగూర్ గారు రాసిన జన గణ మన గేయాన్ని బెంగాలీ నుండి ఇంగ్లీషులోకి అనువదించింది బీటీ కాలేజీలోనే. జన గణ మనకు ట్యూన్ కట్టింది కూడా మన బీటీ కాలేజీలోనే. ఎంతో గొప్ప చరిత్ర ఉన్న పుణ్యభూమి మదనపల్లె.

**రైతుల తరపున పోరాడిన గాంధీజీ :** అక్టోబర్ 2 గాంధీజీ పుట్టిన రోజు. మనకు స్వాతంత్ర్యం, స్వేచ్ఛ ఇచ్చిన గొప్ప వ్యక్తికి నివాళులు అర్పిద్దాం. గాంధీజీ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాల గురించే మనం ఎక్కువ మాట్లాడతాం. కానీ ఆయన రైతుల కోసం చేసిన పోరాటాల గురించి మనం మాట్లాడం. చంపారన్ సత్యాగ్రహం, ఖేడా సత్యాగ్రహం, స్వదేశీ ఉద్యమం, గ్రామ స్వరాజ్యం. రైతుల తరపున అనేక పోరాటాలు చేసింది గాంధీజీ. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని బలంగా నమ్మింది గాంధీజీ. స్వాతంత్ర్యం



వచ్చిన తర్వాత ఎలా బతకాలో ప్రజలకు నేర్పింది గాంధీజీ.

**యువగళంలోనే మిషన్ రాయలసీమ ఆలోచన! :** నేను యువగళం పాదయాత్ర ప్రారంభించిన గడ్డ రాయలసీమ గడ్డ. ఆనాడు గొడ్డలి పార్టీ వాళ్లు నా మైక్ లాక్కున్నారు, నా స్టూల్ లాక్కున్నారు, సోడా బాటిళ్లు, రాళ్లు, గుడ్లతో దాడి చేశారు. అయినా రాయలసీమలో 124 రోజులు, 44 అసెంబ్లీ నియోజకవర్గాలు, 1,587 కి.మీ పాదయాత్ర చేశానంటే దానికి కారణం సీమ ప్రజలు నా పై చూపించిన ప్రేమ, అభిమానం. ప్రతి రోజూ రైతుల్ని కలిశాను, వాళ్లు పడుతున్న కష్టాలు నేరుగా చూశాను. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, పుచ్చకాయ, నిమ్మ, అవకాడో పండిస్తున్న అనేక మంది రైతులతో మాట్లాడాను. వారి నుండి ఫీడ్ బ్యాక్ తీసుకున్నాను. యువగళం పాదయాత్ర 119వ రోజు 2023 జూన్ 7న కడపలో మిషన్ రాయలసీమ ప్రకటించాను.

**హార్టికల్చర్ హబ్ కల నిజం కాబోతుంది :** అందులో ప్రధానమైనది రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మార్చడం. విత్తనం దగ్గర నుండి ప్రపంచానికి కావాల్సిన వెరైటీలు మనం పండించడమే మిషన్ రాయలసీమ లక్ష్యం. రైతుల ఆదాయం పెంచాలన్న అజెండాతో ఆనాడు మిషన్ రాయలసీమ ప్రకటించాను. ఇప్పుడు మన గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ గారు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారు, ముఖ్యమంత్రి చంద్రబాబు గారి సహకారంతో హార్టికల్చర్ హబ్ కల నిజం కాబోతుంది. ఒక రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబు గారికి రైతు కష్టం తెలుసు. ఇప్పుడు అందరం డ్రిప్ ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్నాం. నీటి విలువ తెలిసిన వ్యక్తి మన చంద్రబాబు గారు. అందుకే 1997 లోనే సీమకు ఇజ్రాయెల్ డ్రిప్ ఇరిగేషన్ పరిచయం చేశారు. ఆ బిందు సేద్యమే కరువు నేలను బంగారు భూమిగా మార్చింది. సబ్సిడీలో డ్రిప్ ఇరిగేషన్ అందించిన వ్యక్తి చంద్రబాబు గారు.

**అందుకే చంద్రబాబు వాటర్ మ్యాన్! :** మొన్న ఒక ఇంగ్లీష్ పేపర్లో చంద్రబాబు గారి గురించి రాస్తూ వాటర్ మ్యాన్ అని రాశారు. అది చూసి గొడ్డలి పార్టీ వాళ్లు ఏడుస్తున్నారు. నేను వాళ్లని మూడు ప్రశ్నలు అడగాలి అనుకుంటున్నా. సీమ రైతుకి వరంలాంటి డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ ఎత్తేసింది ఎవరు? పట్టిసీమ ప్రాజెక్టుతో ఎటువంటి ఉపయోగం లేదు అన్నది ఎవరు? పోలవరం ప్రాజెక్టు అర్థం కాలేదు – మీకు ఏం అర్థమవుతుంది అన్నది ఎవరు? గొడ్డలి పార్టీ కాదా? నీటిని దేవుడిలా – ఇరిగేషన్ ప్రాజెక్టులను దేవాలయంలా భావించేది చంద్రబాబు గారు. సీమ ప్రాజెక్టులు ప్రారంభించింది మనమే, పూర్తి చేయబోయేది మనమే. తెలుగు గంగ, ఎస్ఆర్బీసీ, హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వెలిగొండ, పోలవరం మన ట్రేడ్ మార్క్. ఈ ప్రాజెక్టుల వల్లే రాయలసీమ అరటి వరల్డ్ ఫేమస్ అయ్యింది. ఈ ప్రాజెక్టుల వల్లే కరువు నేలపై కియా కార్లను మనం తయారు చేస్తున్నాం.అందుకే ఆయన్ని అందరూ వాటర్ మ్యాన్ అంటున్నారు.

**బాబు ముందుచూపుకు నిదర్శనం ఐఎస్ బి! :** హార్టికల్చర్ అయినా, క్వాంటం అయినా చంద్రబాబు గారు ముందుంటారు. మనం ఈ రోజు గురించి ఆలోచిస్తే... చంద్రబాబు గారు వచ్చే 20 ఏళ్ల గురించి ఆలోచిస్తారు. దానికి ఒక ఉదాహరణే – ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్. దేశంలో ఉన్న గొప్ప పారిశ్రామికవేత్తలు అందరూ కలిసి వరల్డ్ క్లాస్ బిజినెస్ స్కూల్ పెట్టాలి అనుకున్నారు. ఆ విషయం బాబు గారికి తెలిసింది.

వాళ్లు దేశం మొత్తం తిరుగుతున్నారు. హైదరాబాద్ కి రావాలనే ఆలోచనలో అసలు లేరు. కానీ ఐఎస్బీని ఏపీకి తీసుకురావాలని ఆయన ఫిక్స్ అయ్యారు. ఐఎస్బీ బోర్డుని అప్రోచ్ కాగా, వాళ్లు ఏపీ అసలు మా కన్సిడరేషన్ లోనే లేదన్నారు. అప్పుడు బాబు గారు వాళ్లని ఒకసారి హైదరాబాద్ కి రమ్మని ఆహ్వానించారు. సీఎం, మంత్రులు ఎయిర్ పోర్టుకి వెళ్లి ఆహ్వానం పలికారు. స్వయంగా సీఎం గారే ప్రజెంటేషన్ ఇచ్చారు. బొంబాయి, హైదరాబాద్, చెన్నై, కర్ణాటక అన్ని చోట్లకి వాళ్లు వెళ్లారు. ఫైనల్ గా హైదరాబాద్ నే సెలెక్ట్ చేసుకున్నారు. దట్ ఈజ్ బ్రాండ్ సీబీఎన్. ఇప్పుడు ఐఎస్బీ ప్రపంచంలోనే వన్ ఆఫ్ ది బెస్ట్ బిజినెస్ స్కూల్.

**చంద్రబాబుతో అంబానీలది 3తరాల అనుబంధం :** చంద్రబాబు గారికి, అంబానీ కుటుంబానికి మధ్య ఉన్న సంబంధం మూడు దశాబ్దాల నాటిది. ధీరూభాయ్ అంబానీ గారితో ఆయనకున్న అనేక పరిచయాల నుండి, ముఖేష్ అంబానీ గారితో ఉన్న బంధం వరకు, ఇప్పుడు అది తరువాతి తరంతో కొత్త భాగస్వామ్యంగా ఎదిగింది. ఐఎస్బీ వ్యాపార రంగానికి ప్రపంచ స్థాయి సంస్థగా ఎలా మారిందో, మీ నాయకత్వంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ మన రైతుల కోసం ప్రపంచ స్థాయి సంస్థగా మారుతుంది. ఈ సంస్థను నిర్మించడానికి మీరు ఇచ్చిన కట్టుబాటుకు,

అంతకంటే ముఖ్యంగా ఆంధ్రా రైతుల సామర్థ్యంపై మీరు ఉంచిన నమ్మకానికి నేను ధన్యవాదాలు తెలుపుతున్నాను. రాయలసీమ రైతును ఆంధ్రప్రదేశ్ పొలాల నుండి ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్దాం. రాయలసీమ రైతు సత్తా ప్రపంచానికి తెలిసేలా చేద్దామని మంత్రి లోకేష్ అన్నారు.

## దేశంలో అగ్రస్థానమే లక్ష్యం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో ఏపీని నెం. 1గా నిలపడమే మా లక్ష్యమని, ఇందుకు మీ అందరి సహకారం కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విజయవాడ నోవాటెల్ హోటల్ లో పాన్–ఐఐటీ కాన్ఫరెన్స్ టీమ్ తో జరిగిన డిన్నర్ మీటింగ్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు గురించి మీ అందరికీ తెలుసు. ఆపరేటింగ్ సిస్టమ్‌లు ఒక్కో వెర్షన్‌తో మరింత మెరుగుపడుతుంటాయి. అదే విధంగా మన ముఖ్యమంత్రి గారు కూడా ప్రతి వెర్షన్‌తో మరింత మెరుగవుతున్నారు. ఇది ఆయన నాలుగో వెర్షన్. ప్రజాప్రభుత్వంలో 50 శాతం మంది శాసనసభ్యులు తొలిసారి ఎన్నికైనవారే. అలాగే 25 మంది మంత్రుల్లో 17 మంది తొలిసారి మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. నేను ఇప్పుడు సీనియర్ మంత్రిని. రాష్ట్రాభివృద్ధి కోసం మేమంతా కసితో, పట్టుదలతో పనిచేస్తున్నాం.

**ఏపీలో అందరం కలిసి నూతన చరిత్రను సృష్టిస్తున్నాం :** ఈ రోజు సీఎం చంద్రబాబు గారు.. కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్, అనంత్ అంబానీతో కలిసి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ మిషన్ లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగం కలిసి దాదాపు 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ప్రపంచంలోనే ఉద్యానవన రంగంలో భారత్‌ను నెం. 1 స్థానానికి తీసుకెళ్లడమే ఈ మిషన్ లక్ష్యం. ఏపీలో హార్టికల్చర్ నుంచి స్పేస్ వరకు, డ్రోన్ల నుంచి క్వాంటమ్ టెక్నాలజీ వరకు, డేటా సెంటర్ల వరకు ఎన్నో రంగాల్లో ముందుకు సాగుతున్నాం. ఏపీలో మనం నూతన చరిత్రను సృష్టిస్తున్నాం. అంతా కలిసి మన లక్ష్యాలను కార్యరూపంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

**దశాబ్ద కాలంలోనే భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలం :** ఏపీ మీకు ఒక అద్భుతమైన వేదికను అందిస్తోంది. ఇక్కడ కొత్త ఆలోచనలు, కొత్త విధానాలతో వాటికి ఒక బెంచ్‌మార్క్‌ను సృష్టించాలనుకుంటున్నాం. పోటీతో కూడిన సమాఖ్య వ్యవస్థలో ఒక రాష్ట్రం ఒక మంచి పని చేస్తే, మిగతా రాష్ట్రాలు కూడా దానిని అనుసరిస్తాయి. అందువల్ల ఏపీ మార్గదర్శకంగా నిలవగలదని విశ్వసిస్తున్నా. యూరప్, అమెరికా అభివృద్ధి చెందిన దేశాలుగా మారడానికి 100 నుంచి 120 సంవత్సరాలు పట్టింది. దుబాయ్‌కు సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు పట్టింది. సింగపూర్ కేవలం 25 సంవత్సరాల్లో అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగింది. ఇక్కడ ఉన్న మేధోశక్తి, ప్రతిభ, సంకల్పం, సానుకూల నాయకత్వాన్ని గమనిస్తే.. భారత్‌ను కేవలం 10 సంవత్సరాల్లో అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలమని నేను నమ్ముతున్నా. ఒక దశాబ్దంలోనే మనం అభివృద్ధి చెందిన దేశంగా మారగలం. ఒక రాష్ట్రంగా ఏపీ ఈ మార్పునకు నాయకత్వం వహించాలని భావిస్తోంది.

**దేశం గర్వపడేలా రాజధాని అమరావతిని తీర్చిదిద్దుతాం :** దేశంలో 'నమో' అంటే ప్రధాని నరేంద్ర మోదీ గారు. ఏపీలో 'నమో' అంటే 'నాయుడు జీ, మోదీ జీ కా జోడీ. ఇతర రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే.. ఏపీలో మాత్రం డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. మనం పనిచేసే వేగం అలాంటిది. దేశంలో ఏపీ నెం. 1గా నిలవాలనేది మా లక్ష్యం. ఇందుకు మీ అందరి సహకారం కావాలి. మీ సూచనలు, ఆలోచనలు వినడానికి మేం ఎంతో ఆసక్తిగా ఉన్నాం. మేం నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. ఇక్కడికి వచ్చిన మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీరు ప్రస్తుతం విజయవాడలో ఉన్నారు. నది అవతలే అమరావతి ఉంది. మీకు సమయం ఉంటే తప్పకుండా అక్కడికి వచ్చి చూడాలి. మనం షాంఘై, బీజింగ్, సింగపూర్ వంటి నగరాల గురించి మాట్లాడతాం. మన ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో దేశం, ప్రపంచం మొత్తం అమరావతి గురించి మాట్లాడే రోజు వస్తుంది. ప్రపంచస్థాయి రాజధాని నగరాన్ని నిర్మించాలనేది మా లక్ష్యం. దేశం గర్వపడేలా అమరావతిని తీర్చిదిద్దుతాం. ఒక్కసారి అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తే.. ముఖ్యమంత్రి గారి విజన్ ఏంటో స్పష్టంగా అర్థమవుతుందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాన్–ఐఐటీ ఛైర్మన్ ప్రభాత్ సింగ్ తో పాటు పాన్–ఐఐటీ సభ్యులు, దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీల డైరెక్టర్లు, పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ పోస్టుల స్థానిక కేడర్ల ఏర్పాటుపై ఏపీటీఎఫ్ హర్షం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రపతి ఉత్తర్వులు–2025లో భాగంగా ప్రభుత్వ, పంచాయతీరాజ్ యాజమాన్యంలోని ఎస్జీ, స్కూల్ అసిస్టెంట్ తదితర సమాన పోస్టులను జిల్లా కేడర్‌గా, గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయ పోస్టులను జోనల్ కేడర్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం 201, 202 ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయ రాజు, ప్రధాన కార్యదర్శి యస్.చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. పోస్టులను లోకల్ కేడర్‌గా ఆర్గనైజ్ చేయడానికి కృషి చేసిన ప్రభుత్వం, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రెండు సర్వీసులను ఏకీకృతం చేసి కామన్ సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించేలా ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చర్యలు చేపట్టాలని ఏపీటీఎఫ్ కోరింది. దీనివల్ల గత 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కీలక సమస్య పరిష్కారమై, పాఠశాల విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఏపీటీఎఫ్‌తో పాటు అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఆశిస్తున్నాయని హృదయ రాజు, చిరంజీవి తెలిపారు.

## నాడు హామీ.. నేడు సాకారం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మరే ఇతర నాయకుడు చేయని విధంగా యువనేత నారా లోకేష్ రాయలసీమలో 124 రోజులు, 44 అసెంబ్లీ నియోజకవర్గాలు, 1,587 కి.మీ మేర పాదయాత్ర చేసి రికార్డు సృష్టించారు. అ సమయంలో లక్షలాది మంది రాయలసీమ రైతులను నేరుగా కలిసి, వారు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసి చలించిపోయారు. కష్టాలు చూశాను... కన్నీళ్లు తుడుస్తానని ఆనాడు సీమ రైతాంగానికి భరోసా ఇచ్చారు. పాదయాత్ర 119వ రోజున 2023 జూన్ 7న కడప వేదికగా మిషన్ రాయలసీమను ప్రకటించారు. హార్టీకల్చర్ హబ్ గా రాయలసీమను మారుస్తామని, సీమ సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పారు. మామిడి, బొప్పాయి, దానిమ్మ, చీనీ, అరటి తదితర పంటలు వేసేందుకు ప్రోత్సాహం కల్పిస్తామని, 90శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ అందిస్తామని తెలిపారు. దేశానికి, అంతర్జాతీయ స్థాయిలో ఎక్స్ పోర్టు చేసే విధంగా కొత్తరకం విత్తనాలు, మొక్కలు సృష్టించేందుకు హార్టికల్చర్ రీసెర్చి సెంటర్ ఏర్పాటు చేస్తానని ఆనాడు ప్రకటించారు. సీడ్ హబ్ గా ఏపీని మార్చడం ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాయలసీమలో ఫుడ్ ప్రాసెసింగ్, పల్పింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని నాడు రైతులకు హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర సందర్భంగా ఆనాడు రాయలసీమ రైతాంగానికి యువనేత లోకేష్ ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఈరోజు సాకారం చేసింది. ఉమ్మడి ప్రకాశం సహా రాయలసీమలో రూ. 1 లక్ష కోట్ల పెట్టుబడి ప్రణాళికతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్–GHHకు శ్రీకారం చుట్టింది. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కోసం రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం రూ. 40,352 కోట్లు వెచ్చిస్తుంది. ప్రైవేట్ రంగం నుంచి రూ. 60,000 కోట్లు పెట్టుబడులు రాబట్టేలా ప్రణాళికలు రూపొందించారు. సీడ్ టు షిప్ మెంట్ విధానంలో ఉద్యాన రైతులకు అండగా నిలిచేలా ప్రతిష్టాత్మక GHH కు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా ఉద్యాన రైతులకు మేలు కలిగేలా పెద్ద ఎత్తున సాగునీరు, డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను ప్రభుత్వం చేపడుతుంది. రహదారులు, లాజిస్టిక్స్ అభివృద్ధి పనులకూ GHHలో ప్రాధాన్యత ఇస్తారు.

వ్యవసాయ, ఉద్యాన, ఆర్థిక, ఇరిగేషన్ సహా వివిధ కీలక శాఖలతో వరుస సమీక్షలపాటు ముఖ్యమంత్రి కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. రాయలసీమ పరిస్థితులను అర్థం చేసుకుని గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు నిధులు సమకూర్చేందుకు కేంద్రం అంగీకారం తెలిపింది. దీనిద్వారా ఉద్యాన సాగు విస్తరణ, పంట దిగుబడి మొదలుకుని ఎగుమతుల వరకు జరిగే వివిధ ప్రక్రియలను బలోపేతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా రాయలసీమ దేశానికే కాక ప్రపంచానికే "ఫ్రూట్ బౌల్" గా మారుతుంది. ఉద్యానవన రంగం రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ ఉపాధిని సృష్టించడం, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను సాధించడంలో కీలక చోదక శక్తిగా నిలుస్తుంది. ఒకప్పుడు కరువుకు పర్యాయపదంగా ఉన్న రాయలసీమ, మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, పుచ్చకాయ, నిమ్మ, స్వీట్ ఆరెంజ్, అవకాడో, ఆపిల్, బెర్రీస్ వంటి ఉద్యాన పంటలలో దేశంలోనే అగ్రగామిగా నిలవబోతుంది.

## బ్రహ్మంగారిమఠం ఆలయ మేనేజర్‌గా పిపిఎన్ ప్రసాద్



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** ప్రముఖ పుణ్యక్షేత్ర మైన బ్రహ్మంగారిమఠం మేనేజర్ గా పి పి ఎన్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల మేరకు మఠాధిపతులు శ్రీ-శ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వామి వారి ఆంగీకారం తర్వాత జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం మేనేజర్ గా తిరిగి బాధ్యతలు తీసుకున్నారు.

## ఇంటర్ ప్రైవేట్ అభ్యర్థులుగా పరీక్షలకు హాజరయ్యే అవకాశం

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో హాజరు మినహాయింపు పథకం కింద అర్హత కలిగిన వారు కళాశాలలో రెగ్యులర్‌గా చదవకుండానే ప్రైవేట్ అభ్యర్థులుగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో ఆర్ట్స్ కోర్సుల్లో చేరేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. అర్హత కలిగిన వారు ఎలెక్టివ్ లాంగ్వేజ్‌గా ఉర్దూను ఎంపిక చేసుకోవచ్చు. మార్చి 2027లో జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ప్రైవేట్ అభ్యర్థులుగా హాజరు కావాలనుకునే వారు అక్టోబర్ 18, 2026లోగా అవసరమైన ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. వివరాలకు ఉర్దూ ప్రత్యేక అధికారి షేక్ నాగుర్‌వలిని 9885139827లో సంప్రదించవచ్చు.

# వికారాబాద్‌లో మున్సిపల్ తీరుపై అసహనం

- మొన్న దీపాల సమస్య.. నేడు మురుగు.. రేపు ఏమిటో?



**వికారాబాద్, అక్టోబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్: పట్టణంలోని 23వ వార్డులో మురుగు సమస్యపై స్థానిక కౌన్సిలర్ కిరణ్ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులకు సరిపడా సిబ్బంది లేక పోవడంతో ఒకే ఒక్క కార్మికుడితో పనులు కొనసాగుతున్నాయని, దీంతో మురుగు పేరుకు పోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న కౌన్సిలర్ కిరణ్ స్వయంగా పారిశుద్ధ్య పనుల్లోకి దిగడంతోపాటు విద్యుత్ సంబంధిత పనులను కూడా చేపడుతున్న పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధి స్వయంగా సమస్యల పరిష్కారానికి రంగంలోకి దిగాల్సిన పరిస్థితి రావడంపై స్థానికులు మున్సిపల్ అధికారుల తీరుపై ప్రశ్నలు సంధిస్తున్నారు.కౌన్సిలర్ విజ్ఞప్తులను అధికారులు పట్టించుకోకుండా సమస్యలను నాన్చడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి 23వ వార్డులో తగినంత పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి, మురుగు సమస్యతోపాటు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# శంషాబాద్ జోన్‌లో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక వాహనాలు



**శంషాబాద్, అక్టోబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** శంషాబాద్ జోన్ పరిధిలో వీధి కుక్కల సమస్యను నియంత్రించేందుకు జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వీధి కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డాగ్ క్యాచింగ్ వాహనాలను జోనల్ కమిషనర్ కె. చంద్రకళ గురువారం ప్రారంభించారు. జోన్ పరిధిలో వీధి కుక్కల బెడదకు సంబంధించి ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించేందుకు ఈ వాహనాలను వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వీధి కుక్కల సమస్యను గుర్తించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వీధి కుక్కల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు తమ సమస్యలను జీహెచ్ఎంసీ దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు. ఇందుకోసం జీహెచ్ఎంసీ టోల్‌ఫ్రీ నంబర్ 040-21111111కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నమోదు చేసుకుని సంబంధిత సిబ్బంది ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని కోరారు.

# మహిళా థీమ్ పార్క్ నూతన కమిటీ ఏర్పరచుకున్న సందర్భంగా శుభాకాంక్షలు

## - మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**బి.యన్.రెడ్డి నగర్, అక్టోబరు 02 (జర్నలిస్ట్ ఫైల్)** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మహిళా థీమ్ పార్క్ నూతన కమిటీని ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నూతన కమిటీ ఎన్నిక మరియు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా లచ్చి రెడ్డి మాట్లాడుతూ.. నూతన కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.మహిళా థీమ్ పార్క్ నిర్వహణను మరింత మెరుగుపరచడానికి ఈ నూతన కమిటీ ఎంతో బాధ్యతాయుతంగా పనిచేస్తుందని మరియు కాలని సభ్యుల ఆరోగ్యం, ఆహ్లాదం మరియు భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ పార్కును మరింతగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని. కాలనీవాసులు తమ తీరిక సమయంలో ప్రశాంతంగా గడపడానికి, వాకింగ్ మరియు వ్యాయామం చేసుకోవడానికి ఈ పార్క్ ఎంతో దాహోదపడుతుందని,పార్క్ అభివృద్ధికి మరియు కాలనీలోని సమస్యల పరిష్కారానికి మా వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, బిజెపి పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు కాలనీ ప్రతినిధులుసాంబశివరావు, కూర్మా రావు, సోమయాజులు, చంద్రశేఖర్ రెడ్డి, సాయికుమార్, పంపన వెంకటేశ్వర్లు, బసవయ్య, నూతన అధ్యక్షురాలు వర్ధిని, సెక్రటరీ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు శివ నాగేశ్వర్, ట్రెజరర్ నరసింహారెడ్డి, జాయింట్ సెక్రటరీ హైమావతి, కార్యవర్గ సభ్యులు జైపాల్ రెడ్డి,వాణి, నిర్మల, ప్రవీణ్, శ్రీధర్ మరియు రంగారెడ్డి అర్బన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి,పార్టీ సీనియర్ నాయకులు శంకరయ్య గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రవిశంకర్, శరత్ కుమార్, లీలానాథ్, శ్రీనివాస్ రావు,సుధీర్ కుమార్, శబరినాథ్, కామేష్, విజయ్, మురళి మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తలకొండపల్లి జూనియర్ కాలేజ్ ఫ్రెషర్స్ డే వేడుకలు

- లక్ష్యసాధనకు క్రమశిక్షణే మార్గం
- విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలి
- కళాశాల అధ్యాపకులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపు
- దేవకి గార్డెన్ జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు






**తలకొండపల్లి , అక్టోబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థులు విద్యార్థి దశ నుంచే భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలనీ, క్రమశిక్షణతో కూడిన చదువుతోనే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని దేవకీ గార్డెన్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే (నూతన విద్యార్థుల స్వాగతోత్సవం) వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబడాలంటే కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, విద్యతో పాటు నైపుణ్యాలను (స్కిల్స్) పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.అప్పుడే ఆధునిక ప్రపంచంలో వచ్చే ఉన్నత అవకాశాలను అందుకోగలరని ఆకాంక్షించారు. కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యం,అధ్యాపకులపై ఉందన్నారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందించాలని ఆయన కోరారు.కళాశాలకు వచ్చే ప్రతి విద్యార్థిని ఒక ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.అనంతరం విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, సీనియర్ విద్యార్థులు మరియు నూతనంగా చేరిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓబీసీ కులగణన సాధనకై శంషాబాద్‌లో భారీ బహిరంగ సభ



**శంషాబాద్ , అక్టోబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన చేపట్టాలనే డిమాండ్‌తో శంషాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. అక్టోబర్ 4వ తేదీన శంషాబాద్‌లోని గొల్లగూడ రోడ్డులో టీపీసీసీ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో ఈ సభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఓబీసీల జనాభా వివరాలు అధికారికంగా నమోదు కావడం ద్వారా వారికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులను మరింత సమగ్రంగా అంచనా వేసేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఓబీసీ కులగణన డిమాండ్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, ప్రస్తుత, మాజీ గ్రామ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా జన సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని వీర్లపల్లి శంకర్ సూచించారు. ఓబీసీ కులగణన కోసం చేపడుతున్న కార్యక్రమానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి, సభకు పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించాలని ఆయన కోరారు. అక్టోబర్ 4న శంషాబాద్‌లో జరిగే బహిరంగ సభకు ఓబీసీ వర్గాలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఎస్.ఐ.ఆర్ నోటీసులకు ఆన్లైన్ ద్వారా ధృవీకరణ పత్రాలు అందించవచ్చు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి





**నిజామాబాద్, అక్టోబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు వ్యక్తిగతంగా బీ.ఎల్.ఓలను నేరుగా కలువకుండా,ఆన్లైన్ లో ఈ-మెయిల్,వాట్సప్ ల ద్వారా కూడా సంబంధిత ధృవీకరణ పత్రాలను పంపవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతి గురించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష జరిపారు.ఫారం-6,ఫారం-7,ఫారం-8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.మ్యాపింగ్ జరగని వారికి పేరు,ఇతర వివరాలలో వ్యత్యాసం కలిగి ఉన్న వారికి ఎస్ఐఆర్ లో భాగంగా జారీ చేసిన నోటీసులకు సంబంధించి విచారణ పక్కాగా జరపాలన్నారు.అనర్హులుగా ఉన్నట్లు నిర్ధారణ అయితే,అలాంటి వారికి స్పీకింగ్ ఆర్డర్స్ ద్వారా తెలియజేయాలని అన్నారు.ఇంకనూ ఎవరికైనా నోటీసులు జారీ కాకపోతే వెంటనే నోటీసులు అందజేయాలన్నారు.ఎస్.ఐ.ఆర్ పురోగతి గురించి ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలకు సమాచారం అందించాలని సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ....జిల్లాలో ఇంకనూ 6106 మందికి నోటీసులు అందించాల్సి ఉందన్నారు.నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఎక్కువ సంఖ్యలో 3865 నోటీసులు పెండింగ్ లో ఉన్నాయని,ఆర్మూర్ లో 1631,బోధన్ లో 16,బాన్సువాడ సెగ్మెంట్ లో 437,బాల్కొండ నియోజకవర్గంలో 157 నోటీసులు ఇంకనూ అందించాల్సి ఉందని తెలిపారు.వీరిలో అత్యధిక మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళడం,ఓటరు జాబితాలో పొందుపరచిన చిరునామాలలో ఉండకపోవడం వంటి కారణాల వల్ల నోటీసులు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు.బీ.ఎల్.ఓలను క్షేత్రస్థాయిలో వారి ఇళ్ళకు పదేపదే పంపిస్తూ నోటీసులు అందించే ప్రయత్నం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పురోగతి గురించి ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలకు సమాచారం తెలియజేస్తున్నామని, ఈ.ఆర్.ఓ, ఏ.ఈ.ఆర్.ఓల కార్యాలయాల నోటీసు బోర్డులలో కూడా సమాచారాన్ని ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.కాగా,ఇప్పటికే నోటీసులు అందుకున్న ఓటర్లు బీ.ఎల్.ఓలను నేరుగా కలిసే అవకాశం లేనట్లైతే ఆన్లైన్ ద్వారా వాట్సప్,ఈ-మెయిల్ ద్వారా సంప్రదించి ధృవీకరణ పత్రాలు పంపవచ్చని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పక పాటించాలని,హియరింగ్ ను పారదర్శకంగా నిర్వహిస్తూ,నిర్ణీత గడువు లోపు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ.ఆర్.ఓలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,ఆర్డీఓ రాజేంద్ర కుమార్,కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు పాల్గొన్నారు.

# సామాన్యుడి వజ్రాయుధం సమాచార హక్కు చట్టం : తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి.శ్రీనివాసరావు

**ఖమ్మం , అక్టోబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** సమాచార హక్కు చట్టం సామాన్య పౌరుడికి వజ్రాయుధం వంటిదని తెలంగాణ సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎస్ ఆర్ బీ జీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల లో ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా అధ్యక్షతన జరిగిన సమాచార హక్కు చట్టం –స్వరూప స్వభావాలు అనే అంశంపై జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలు,చరిత్ర, గతం వర్తమానం భవిష్యత్తు గురించి విద్యార్థులుఅధ్యయనం చేయాలని సూచించారు. కళాచరిత్రను ఈనాటి విద్యార్థులు తెలుసుకోవాలని పేర్కొన్నారు శ్రీశ్రీ లాంటి కవులు సందర్శించిన కళాశాల లో చదువుతున్నామని సగర్వంగా నిలవాలని కోరారు. జవాబుదారితనం ఉండాలనే ఆలోచనతో ఈ చట్టం వచ్చిందని, పౌర సమాజానికి పారదర్శకత ఉండాలనే ఆకాంక్షతో ఆర్టీఐ–2005 లో సమాచార హక్కు చట్టాన్ని రూపొందించారని తెలిపారు. విద్యార్థులు సామాజిక అవగాహన తోపాటు ,పౌరబాధ్యతలను గుర్తెరిగి వ్యవహరించడం ముఖ్యమన్నారు. రాజ్యాంగ వ్యవస్థల గురించి అవగాహన ఈకలిగిఉండటం అనివార్యమని వెల్లడించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ ఎన్ శాస్త్రి,




ఎగ్జామ్స్ కంట్రోలర్ డా.రమాసత్యవతి,పూర్వ విద్యార్థి వంజాకులలక్ష్మి నారాయణ ,గెంటేలనారాయణరావు మనుమడు శ్రీనివాసరావు, అధ్యాపకులు బంగారా, డా.వైరవివర్ధన్,డా.లక్ష్మణరావు,పి.నరసింహారావ, అజిత్, అప్పారావు కె.శ్రీనివాస్, వివిధ విభాగాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు., నందిరామయ్య, జిల్లా నాయకులు,ఆర్ రమేష్ బి దేవరం,నాయకులు ఆర్ దామోదర్,బి బాబన్న కిషోర్ రమేష్, రమ ,సత్తెమ్మ,పుష్ప,జమున,లావణ్య తదితరులు పాల్గొన్నారు

# ప్రమీల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం

**ఖమ్మం , అక్టోబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం నగరంలోని పాత సిపిఐ ఆఫీస్ పక్కన, నెహ్రూ నగర్‌లోని ప్రమీల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు గురువారం ప్రమీలా హాస్పిటల్ నిర్వాహకులు పిట్టల నాగేశ్వరరావు, శ్రీకాంత్ రాజా ఆధ్వర్యంలో★ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు పగడాల నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఆరోగ్య శిబిరంలో ముఖ్యంగా బోన్ స్ట్రెంత్ (ఎముకల బలం) పరీక్షలను నిర్వహించారు. ఎముకలు బలహీనపడటం వల్ల ఎముకలు విరగడం, కీళ్ల సమస్యలు తదితర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఆర్థో సర్జన్ డాక్టర్ గుర్రం వినీల్ ఎముకల బలం ఏ స్థాయిలో ఉందో పరీక్షించి, బోన్ స్ట్రెంత్ తగ్గినట్లయితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, అవసరమైన వైద్య సూచనలపై శిబిరానికి వచ్చిన వారికి అవగాహన



కల్పించారు.ఈ ఉచిత ఆరోగ్య శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.ప్రమీలా హాస్పిటల్ నిర్వాహకులు పిట్టల నాగేశ్వర రావు, శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన



ఈ ఉచిత ఆరోగ్య శిబిరం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.

# కొత్తగూడెం ఐఎంఏ హాలులో ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

- శిక్షణను సద్వినియోగం చేసుకొని లక్ష్యాన్ని సాధించాలి: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు






**ఖమ్మం , కొత్తగూడెం, అక్టోబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీస్ శాఖ, సింగరేణి సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణ తరగతులు గురువారం కొత్తగూడెంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ హాజరై శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు పలు సూచనలు చేశారు.స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపికైన 200 మంది అభ్యర్థులకు 60 పని దినాల పాటు ఉచిత శిక్షణ అందించనున్నారు. వివిధ అంశాల్లో నైపుణ్యం కలిగిన అధ్యాపకులతో నాణ్యమైన శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఆర్ఐ ఆపరేషన్స్ బి. రవి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత మధ్యాహ్న భోజన వసతి కూడా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ పట్టుదలతో చదివి, నిరంతరం సాధన చేస్తేనే పోలీస్ ఉద్యోగ లక్ష్యాన్ని సాధించగలరని అభ్యర్థులకు సూచించారు. శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా హాజరై అధ్యాపకులు అందించే సూచనలు, శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.పోటీ పరీక్షల్లో ప్రశ్నలను సరిగ్గా అర్థం చేసుకొని, సమయపాలనతో సమాధానాలు రాసే విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి అభ్యర్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకొని, క్రమశిక్షణతో చదువుతూ, నిరంతరం సాధన చేయాలని అన్నారు. సరైన ప్రణాళిక, సమయపాలన, కష్టపడి చదవడం, పట్టుదలతో ముందుకు సాగితే ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలను సాధించవచ్చని ఎస్పీ తెలిపారు.పోలీస్ శాఖ, సింగరేణి సంస్థ సంయుక్తంగా కల్పిస్తున్న ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని అభ్యర్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాలను సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సింగరేణి వెల్ఫేర్ డీజీఎం సునీల్ కుమార్, ఆర్ఐ ఆపరేషన్స్ బి. రవి, అధ్యాపక బృందం, పోలీస్ అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# క్లినికల్ శిక్షణ కొరకు అక్టోబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలి : జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు

**ఖమ్మం , అక్టోబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** ఇంటర్మీడియట్ ఎం.ఎల్.టి. ఒకేషనల్ కోర్సులో మార్చి 2024 సంవత్సరం నుండి ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులకు క్లినికల్ శిక్షణ ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందించనున్నట్లు, శిక్షణకు ఎంపికైన వారు వెయ్యి రూపాయలు డి.డి. రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకోని, ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవి బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తిగల విద్యార్థినీ, విద్యార్థులు తమ బయోడేటా ఫారంతో పాటు పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన స్వంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి సమీకృత జిల్లా కలెక్టర్ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో అక్టోబర్ 15 లోగా అందజేయాలని రవిబాబు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎస్.జి.ఎఫ్. సౌత్ ఓవరాల్ ఛాంపియన్స్ గా శ్రీ చైతన్య విద్యార్థులు



**ఖమ్మం , అక్టోబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక మమత హాస్పిటల్ రోడ్డు నందు గల శ్రీ చైతన్య ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు గత మూడు రోజులుగా ( సెప్టెంబర్ 28 నుండి 30 వరకు) సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో జరిగిన ఖమ్మం అర్బన్ సౌత్ మండల్ లెవెల్ లో అండర్ 14 గర్ల్స్ అండ్ బాయ్స్ అండర్ 17 బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగంలో, కబడ్డీ, కోకో, వాలీబాల్, అథ్లెటిక్స్, వంటి క్రీడలు నిర్వహించబడ్డాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ మండల ఎం.ఈ.ఓ. శైలజ లక్ష్మి విచ్చేసి బహుమతి ప్రధానం చేశారు. గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. విద్యాసంస్థల చైర్మెన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ మా విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రదర్శన చేయగలరని తెలిపారు. శ్రీ చైతన్య విద్యాసంస్థలు అనేవి విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఒక వేదిక అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల డీ.జీ.ఎం. చేతన్ మాథూర్, స్కూల్ ప్రిన్సిపల్ లు టీ.ఎల్.ఎన్. శర్మ, నాగప్రవీణ, వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, జోనల్ పి.ఈ.టి నాగరాజు పి.ఈ.టిలు శివకృష్ణ, రమేష్, వెంకట్, నవ్య, సునీత, హుస్సేన్, జాన్ లు గెలుపొందిన విద్యార్థులు పాల్గొన్నారు.14–లోపు

వాలీ బాల్ బాలురు మొదట బహుమతి ఖో–ఖో

బాలలు, బాలికల విభాగాల్లో రెండవ బహుమతి

కబడ్డి బాలికలు మొదటి బహుమతి17–లోపు

వాలీ బాల్ బాలికలు మొదటి బహుమతి17–లోపు కబడ్డి

బాలికలు మొదటి బహుమతి17–లోపు ఖో–ఖో

బాలికలు రెండవ బహుమతి14–లోపు 400మీ

రన్నింగ్ బాలురు మొదటి బహుమతి14–లోపు 100 మీ

రన్నింగ్ బాలురు మొదటి బహుమతి17–లోపు 400మీ

రన్నింగ్ బాలురు రెండవ బహుమతి17–లోపు 400మీ

రన్నింగ్ బాలురు మూడవ బహుమతి17–లోపు

400మీ రన్నింగ్ బాలికలు మూడవ బహుమతులు సాధించారు.

# మతోన్మాద శక్తులను తరిమి కొట్టాలి, సమైక్యత సార్వభౌమత్వాన్ని కాపాడాలి : తంజీమ్ -ఎ -ఇన్సాఫ్ నేత మొహమ్మద్ సలాం.



**ఖమ్మం , అక్టోబరు 02 (జర్నలిస్ట్ ఫైల్) :** రోజు రోజు కి దేశంలో మతోన్మాద శక్తులు భక్తి పేరుతో గ్రామాల్లో ప్రజలను విడదీసి వర్గాల మధ్యలో లబ్ధి కోసం రాజకీయ లబ్ధి కోసం ప్రజలను ప్రక్క దోవ ప ట్టిస్తున్నార ని ప్రజలు ఐక్యంగా అప్రమత్తంతో మతోన్మాద శక్తులను తరిమి కొట్టాలని తాంజీమ్ –ఎ –ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మొహమ్మద్ సలాం పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి స్థానిక కొణిజర్ల లో ఎస్ కే రజాక్, సైదులు అధ్యక్షతన కొణిజర్ల గ్రామ శాఖ ,ఇన్సాఫ్ ,మహా సభ జరిగింది. ముఖ్య అతిథిగా మహమ్మద్ సలాం మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలను చైతన్య పరచాలని, ప్రజలు ప్రక్క దోవ పట్టకుండ ఐక్యతను చాటి చెప్పాలని ముస్లిం మైనార్టీల పై ఎస్ సి, ఎస్ టి ల పై జరుగుతున్నా దాడులు వేధింపులు, ప్రార్థన స్థలాల కూల్చివేత,పూర్తిగా ఖండించాలని, ఓటు బ్యాంకు రాజకీయాలు చేసి వారి ని బుద్ధి చెప్పాలని మైనార్టీ హక్కుల సాధన కోసం పోరాటలు చెయ్యాలని వారు పిలుపునిచ్చారు ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వాలు తమ హక్కులను కాలా రాస్తున్నారని మైనార్టీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సాధించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ జెడ్పీటీసి సభ్యులు దొండపాటి రమేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు స్వర్ణ రమేష్, చింతల అది రెడ్డి, ఎస్ కే మహబూబి, తోటపల్లి సీతారాములు, ఇన్సాఫ్ నాయకులు ఎండీ. ముజామ్మిల్ అనంతరం నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. కొనిజర్ల గ్రామ శాఖఅధ్యక్షుడు, ఎస్.కె సైదులు. ప్రధాన కార్యదర్శి గా ఎస్కే రజాక్ ఉపాధ్యక్షులుగా ఎస్.కె మదర్ బి సహాయ కార్యదర్శిగా ఎస్ కే హస్సాన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్కే పాషా కోశాధికారిగా కమిటీ సభ్యులు గాఎస్కే గౌషాబి ఎస్.కె నశీనా ఎస్ కే ఇమ్రాన్ బి ఎస్.కె బేగం లను మహాసభలో ఎన్నుకున్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల్లో గుంటూరుకు మూడు పురస్కారాలు



○ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న కమిషనర్ మయూర్ అశోక్

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్-2026లో గుంటూరు నగరపాలక సంస్థ మూడు విభాగాల్లో పురస్కారాలు సాధించింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కమిషనర్ కె.మయూర్ అశోక్ స్వచ్ఛ మునిసిపాలిటీ అవార్డును అందుకున్నారు. మూడు లక్షలు, అంతకంటే ఎక్కువ జనాభా కేటగిరీలో గుంటూరు రెండో స్థానం సాధించగా, ఇంటింటా చెత్త సేకరణ, తడి చెత్తతో సేంద్రీయ ఎరువుల తయారీ, వ్యర్థాల ప్రాసెసింగ్, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ వంటి చర్యలు అవార్డుకు దోహదపడ్డాయని కమిషనర్ తెలిపారు.

వాయు సర్వేక్షణ్-స్వచ్ఛ వాయు విభాగంలో గాలి నాణ్యత మెరుగుదల, ధూళి నియంత్రణ, పచ్చదనం పెంపు చర్యలకు పురస్కారం లభించిందన్నారు. స్వచ్ఛ హౌసింగ్ కాలనీల విభాగంలో ఎల్ఐసీ కాలనీ-తేజ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. నగరాన్ని స్వచ్ఛతలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికులకు అభినందనలు తెలియజేశారు.

# సమరశీల భావాలతో మెలిగే స్నేహశీలి లేళ్ళ అప్పిరెడ్డి



○ బీసీ సెల్ రాష్ట్ర నేత ఓర్చు శ్రీనివాసరావు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా రాజకీయాల గురించి ఎప్పుడు, ఎక్కడ ప్రస్తావన వచ్చినా ప్రముఖంగా వినిపించే పేరు లేళ్ళ అప్పిరెడ్డి అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓర్చు శ్రీనివాసరావు వెల్లడించారు.

శాసనమండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి జన్మదిన వారోత్సవాలు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి.

ఈ సందర్భంగా చుట్టుగుంట సమీపంలోని సాయినగర్ రెండవ లైన్‌లో గల కళాభారతి అంధుల ఆశ్రమంలో నేలటూరి సుందరరావు నేతృత్వంలో పండ్ల పంపిణీ, కేక్ కటింగ్ జరిగింది. అనంతరం బ్రాడీపేటలోని నిర్మల్ హృదయ్‌లో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఓర్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాజకీయంగా లేళ్ళ అప్పిరెడ్డి ఆలోచనలు ఎప్పుడూ ఎంతో ఉన్నతంగా ఉంటాయని తెలిపారు. సమరశీల భావాలతో మెలిగే స్నేహశీలిగా ఆయనను అభివర్ణించారు. విశాల దృక్పథంతో.. విలక్షణ శైలితో.. రాష్ట్రరాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన లేళ్ళ అప్పిరెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలన్న ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, బీసీ విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి ఓర్చు శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, పడాల సుబ్బారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్, రత్నప్రసాద్, ఏసీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ ముత్యం, స్థానిక నేతలు చంద్రహాసన్, అనిల్, రవీంద్రారెడ్డి, వి.అన్న మేరీ, వి.నందు, యమ్.సుందర్, వి.రవికుమార్, యమ్.వెంకటేశ్వర్, మేకతోటి ప్రకాష్, సిహెచ్.రమేష్, ఎ.సుదీర్, డి.రామారావు, సిహెచ్.రమేష్, చిన్నా, కాకి శ్రీనివాసరావు, కౌండిన్య, రవీంద్ర, కరీం, రెడ్డి కోటేశ్వరరావు, శివ పార్వతి, విజయారెడ్డి, మన్నెం లక్ష్మి, ఆనంద్, సింగు నరసింహరావు, సుబ్బరాజు, శంకర్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భాగ్యారావు, ప్రసన్న, నీలి, గులేచా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కడప డిఎస్పీగా పి.రామకృష్ణుడు నియామకం



**కడప(జర్నలిస్ట్ ఫైల్):** వైయస్సార్ కడప జిల్లా కడప డిఎస్పీగా పి రామకృష్ణుడును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసారు. 1995 బ్యాచ్ కు చెందిన ఈయన జిల్లాలో ఎస్సైగా సీఐగా పలుచోట్ల పనిచేశారు. కడప తాలూకా పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న సమయంలో 2008లో సీఐగా పదోన్నతి పొందారు.

జిల్లాలో రాయలసీమలో వివిధ చోట్ల పని చేశారు. డీఎస్పీగా పదోన్నతి పొందిన తర్వాత ప్రస్తుతం నెల్లూరు ఏసీబీ డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. అక్కడి నుంచి బదిలీపై కడప డిఎస్పీగా నియమితులయ్యారు. త్వరలో బాధ్యతలను చేపట్టనున్నారు.

# గాంధీజీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత మార్గం యువతకు ఆదర్శం

○ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత, క్రమశిక్షణ మార్గం నేటి యువతకు ఆదర్శమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా కొరిటిపాడు సెంటర్‌లో గాంధీ విగ్రహానికి, శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, వల్లూరి జయప్రకాశ్ నారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీజీని కేవలం స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా విలువలకు కట్టుబడి జీవించిన మహనీయుడిగా గుర్తు చేసుకోవాలని మాధవి అన్నారు. సత్యం, అహింస, స్వచ్ఛత, నిజాయితీ వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. ఆవేశానికి తావివ్వకుండా అహింసా మార్గంలో లక్ష్యాలను సాధించిన గాంధీజీ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. స్వచ్ఛతకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యతను స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి దేశభక్తి, నిరాడంబరత, నిజాయితీకి ప్రతీకగా నిలిచారని ఎమ్మెల్యే కొనియాడారు. గాంధీ, శాస్త్రి ఆశయాలు, విలువలు భావితరాలకు మార్గదర్శకమని, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు వాటిని ఆచరణలో పెట్టాలని సూచించారు.

మహనీయుల స్ఫూర్తితో పనిచేస్తే దేశం, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు భద్రయ్య, మాజీ కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావుతో పాటు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీల రిజర్వేషన్ల విషయంలో వెనక్కి తగ్గేది లేదు

○ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం చట్టబద్ధ చర్యలు

○ బీసీలపై వైసీపీది కపట ప్రేమ: ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్నదే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. బీసీల రాజకీయ సాధికారత కోసం చట్టబద్ధమైన మార్గాల్లో ప్రభుత్వం ముందుకు సాగాలని, న్యాయపరమైన అంశాలు ఎదురైనా బీసీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీలపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని నక్కా ఆనందబాబు విమర్శించారు. గత ఐదేళ్ల పాలనలో బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి తీసుకున్న చర్యలపై ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా రాజకీయంగా ఎదిగేలా అవకాశాలు కల్పించడంతో పాటు వారి పిల్లలకు విద్య, యువతకు ఉపాధి, కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీలకు రాజకీయ సాధికారత కల్పించేందుకు కట్టుబడి ఉందని నక్కా ఆనందబాబు తెలిపారు. బీసీల హక్కుల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని, 34 శాతం రిజర్వేషన్ల అమలుకు అవసరమైన చర్యలను కొనసాగిస్తామని అన్నారు. బీసీలకు ఎవరు అండగా నిలిచారు, ఎవరు ఎన్నికల సమయంలో మాత్రమే వారిని గుర్తు చేసుకున్నారనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

# జిల్లా అండర్ 19 బేస్ బాల్ సాఫ్ట్ బాల్ ఎంపికకు విశేష స్పందన

○ బారీగా హాజరైన ఉమ్మడి కడప జిల్లా క్రీడాకారులు

○ సెక్రటరీ మురళీకృష్ణ రెడ్డి అధ్యక్షతన ఎంపిక




**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** మండల కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో కరస్పాండెంట్ మాజీ మంత్రివర్యులు డాక్టర్ డి ఎల్ రవీంద్రారెడ్డి సహకారంతో జిల్లా అండర్ 19 సెక్రటరీ మురళీ కృష్ణ రెడ్డి ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర రెడ్డి పర్యవేక్షణలో ఉమ్మడి కడప జిల్లా బేస్ బాల్ మరియు సాఫ్ట్ బాల్ ఎంపిక కార్యక్రమం స్థానికతెలుగుగంగా క్రీడా మైదానంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి ఉమ్మడి కడప జిల్లా నుంచి భారీ ఎత్తున క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేశారు ముందుగా ఏర్పాటుచేసిన సమావేశ కార్యక్రమాల్లో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దాదాపు 200 మంది క్రీడాకారులు బేస్ బాల్ మరియు సాఫ్ట్ బాల్ ఎంపిక కు రావడం జరిగిందని ఇంత పెద్ద ఎత్తున రావడం చూస్తే చాలా ఆనందంగా ఉందని బ్రహ్మంగారిమఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల వారి ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం ఉమ్మడి కడప జిల్లా క్రీడాకారులకు మంచి చక్కని అవకాశం అని ఇందులో ఎంపికైన క్రీడాకారులకు ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడలకు పాల్గొనే అవకాశం కల్పిస్తామని రానున్న రోజుల్లో బ్రహ్మంగారి మఠం మండలంలో మరిన్ని క్రీడా పోటీలను నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి హాజరై క్రీడలను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో విశ్రాంతి అధ్యాపకులు చెన్నారెడ్డి ఈశ్వర్ రెడ్డి నాగిరెడ్డి శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్ర శేఖర్ అల్లా బకాష్ మాజీ అండర్ 19 ఎస్ జి ఎఫ్ సెక్రటరీ సుబ్బరాజు విజయ్ ప్రసాద్ రెడ్డి, అండర్ 17 మాజీ సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి క్రీడాకారులు వెంకటసుబ్బయ్య హరి ఆకుల విజయ్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** భారతావని స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం త్యాగం చేసిన మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని టీడీపీ నేత డా. కత్తెర సురేష్ కుమార్ అన్నారు. రామలింగేశ్వరపేటలోని టీడీపీ కార్యాలయంలో గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. గాంధీజీ చూపిన అహింస, శాంతి, ప్రేమ మార్గాలను నేటి యువత అనుసరించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, వసంతం అశోక వర్ధన, తాడిబోయిన హరిప్రసాద్, జొన్నాదుల మహేష్, కేసన కోటేశ్వరరావు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, యుగంధర్, బోయపాటి అరుణ, తవ్వా ప్రసాద్, మల్లవరపు విజయ్, సుద్దపల్లి నాగరాజు, రాజేంద్రప్రసాద్, డా. వేమూరి శేషగిరిరావు, సాంబయ్య, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లె,డి.అగ్రహారంలో సీసీ రోడ్లు



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** మండల పరిధిలోని కొత్తపల్లె, డి.అగ్రహారం లోని హరిజనవాడలో రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన గ్రామీణ మౌలిక వసతులను తిరిగి పునరుద్ధరిస్తున్నామని అన్నారు. రోడ్లు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో సీసీ రోడ్లను మంజూరు చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ మురళీధర్ రెడ్డి, ఏపీవో హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, పుటాల శివ యాదవ్, రామాంజనేయులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహాత్ముని బాటలో కూటమి పాలన



○ బాపూజీ జీవితం అందరికీ ఆదర్శప్రాయం

○ ఘనంగా గాంధీజీ జయంతి వేడుకలు

○ తూర్పు కార్యాలయంలో నివాళులర్పించిన ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలే ప్రజలకు మంచి పాలన అందిస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో మహాత్ముని చిత్రపటానికి ఎమ్మెల్యే నసీర్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీ జీవితం అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. సత్యం, అహింస అనే రెండు బలమైన ఆయుధాలతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహానీయుడు గాంధీజీ అని కొనియాడారు. నేటి యువత చెడు మార్గాలను విడనాడి, గాంధీజీ చూపిన శాంతి మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతిభద్రతలు పరిఢవిల్లాలంటే ప్రతి ఒక్కరూ అహింసా మార్గాన్ని అలవర్చుకోవాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గాంధీజీ కలలు కన్న స్వరాజ్యసాధనకై ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నామని తెలిపారు.

**ఘనంగా శాంతి ర్యాలీ**

గాంధీ జయంతి సందర్భంగా గుంటూరు నగరంలో అహింస, శాంతి సందేశాన్ని చాటిచెప్పేలా ఘనంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. హిమని సర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఎమ్మెల్యే నసీర్ ముఖ్య అతిథిగా విచ్చేసి, భారీ సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. అనంతరం అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో చేపట్టిన తనిఖీల్లో 18 ఎఫ్ఐఆర్ కేసులు, 147 పెట్టీ కేసులు నమోదు చేశారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపిన ఎనిమిది మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వైన్ షాపుల సమీపం, ముఖ్య కూడళ్లు, ఖాళీ స్థలాలు, పార్కులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ పరిసరాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళలు, చిన్నారులు రాత్రివేళల్లో సురక్షితంగా తిరిగే వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు. మద్యం షాపుల వద్ద లేదా పరిసరాల్లో బహిరంగంగా మద్యం సేవించేందుకు అనుమతిస్తే షాపు యజమానులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగంగా మద్యం సేవించడం, గొడవలు చేయడం లేదా మహిళలకు ఇబ్బందులు కలిగించే ఘటనలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 100, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

# గాంధీ, శాస్త్రి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుందాం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో వారి చిత్రపటాలకు ఆర్ఎస్ఐలు టీ. బాలశంకరరావు, బీవీ. సుబ్బారెడ్డి, ఎంవీ. సుబ్బారావు, జి. రాజారత్నం పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాంధీజీ బోధించిన సత్యం, అహింస, శాంతి మార్గాలను, లాల్‌బహదూర్ శాస్త్రి పాటించిన దేశభక్తి, క్రమశిక్షణ, నిరాడంబరత వంటి విలువలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

గాంధీ, శాస్త్రి ఆశయాలను ఆచరణలో పెడుతూ ప్రజల పట్ల మరింత బాధ్యతాయుతంగా, నిష్పక్షపాతంగా, అంకితభావంతో విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు టీ. బాలశంకరరావు, బీవీ. సుబ్బారెడ్డి, ఎంవీ. సుబ్బారావు, జి. రాజారత్నం, పీఆర్ఓ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత : కలెక్టర్ సాయికాంత్ వర్మ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మహాత్మాగాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛతను ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి సమష్టిగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి స్వచ్ఛత అవార్డుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛత కేవలం ప్రభుత్వం, పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత కాదని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

గుంటూరు జిల్లాకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు స్వచ్ఛత అవార్డులు దక్కడం అభినందనీయమన్నారు. గుంటూరు, తెనాలి, మంగళగిరి-తాడేపల్లి, పొన్నూరు పట్టణ స్థానిక సంస్థలు రాష్ట్రస్థాయి అవార్డులు సాధించాయని, స్వచ్ఛ వాయు కార్యక్రమంలో గుంటూరు నగరానికి దేశవ్యాప్తంగా రెండో స్థానం లభించిందన్నారు. నంబూరు స్వచ్ఛ గ్రామ పంచాయతీగా, నిడమర్రు స్వచ్ఛ పాఠశాలగా, ఇందిరానగర్ యూపీహెచ్‌సీ స్వచ్ఛ ఆసుపత్రిగా, దుగ్గిరాల కాంటినెంటల్ కాఫీ స్వచ్ఛ పరిశ్రమగా ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో 62 మందికి అవార్డులు అందజేశారు.

స్వచ్ఛత కార్యక్రమాన్ని ఇల్లు, పరిసరాలు, కార్యాలయం నుంచే ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంటే మెరుగైన పని వాతావరణం ఏర్పడుతుందన్నారు. గుంటూరు జిల్లా సాధించిన గుర్తింపును మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని కోరారు.

స్వచ్ఛత కేవలం పారిశుద్ధ్య కార్మికుల బాధ్యత కాదని, ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా స్వీకరించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా, వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం, వ్యర్థాలను సంపదగా మార్చే విధానాలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చన్నారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో స్వచ్ఛతపై అవగాహన పెంచాలని అన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, వారి కృషిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయడం, తడి-పొడి చెత్తను వేరు చేయడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ కిషోర్, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## రక్తదానం.. ప్రాణదానంతో సమానం



**○ ఏపీ ఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్**

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** సమాజంలో ప్రతి ఒక్కరూ స్వప్రయోజనంతో పాటు సమాజ శ్రేయస్సు కోసం ఆలోచించాలని, ప్రభుత్వ ఉద్యోగులు విధులకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఏపీ ఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ అన్నారు. మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఏపీ పేపర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భాగస్వామ్యంతో విజయవాడ గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీజీఓస్ హోమ్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని విద్యాసాగర్ తెలిపారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవాలు, తలసేమియా వంటి పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తదాతలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గాంధీజీ సేవా స్ఫూర్తి, లాల్‌బహదూర్ శాస్త్రి కర్తవ్యనిష్ఠను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగులు, యువత, వ్యాపార వర్గాలు సామాజిక సేవలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

పేపర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ సమాజ సేవ ఉద్దేశంతో తమ సంఘం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. రానున్న పుష్కరాల్లో భక్తులకు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మఫత్ లాల్ జైన్, ఉపాధ్యక్షుడు కె. నాగేశ్వరరావు, రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి ఇ. చిట్టిబాబు, వైస్ చైర్మన్ డా. వెలగా జోషి, ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ ప్రతినిధులు, రెడ్ క్రాస్ సభ్యులు, ఉద్యోగులు, పేపర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## గాంధీ, శాస్త్రి ఆశయాలను ఆచరించాలి : బీజేపీ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** తూర్పు అసెంబ్లీ నియోజకవర్గంలోని 51వ డివిజన్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని స్వచ్ఛభారత్ కార్యక్రమంగా నిర్వహించారు. తూర్పు అసెంబ్లీ బీఎల్ఏ-1, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చరక కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పాంగి రాజారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాయకులు, స్థానిక ప్రజలు కలిసి గ్రౌండ్‌లోని గడ్డి, పిచ్చిమొక్కలు, వ్యర్థాలు, మద్యం, బీరు సీసాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాంగి రాజారావు మాట్లాడుతూ సత్యం, అహింస, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం, పేదల సంక్షేమం వంటి గాంధీజీ ఆశయాలు నేటికీ ఆదర్శప్రాయమన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి సరళత, నిజాయితీ, దేశభక్తి, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచారని, రైతు--సైనికుల ప్రాధాన్యతను చాటిచెప్పిన 'జై జవాన్--జై కిసాన్' నినాదం స్ఫూర్తిదాయకమన్నారు. గాంధీ, శాస్త్రి ఆశయాలకు అనుగుణంగా స్వచ్ఛభారత్, రైతులు, సైనికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మహనీయులను స్మరించుకోవడం అంటే చిత్రపటాలకు పూలమాలలు వేయడం మాత్రమే కాకుండా వారి విలువలను జీవితంలో ఆచరించడమేనన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ సత్యం కోసం నిలబడాలని, దేశం కోసం పనిచేయాలని, రైతులు, సైనికులను గౌరవించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన, సమర్థవంతమైన, ఐక్య భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలపాటి రవికుమార్, పలువురు బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీఆర్సీ నియామక జీఓను సవరించాలి



**○ వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి**

**తాడేపల్లి(జర్నలిస్ట్ ఫైల్):** పీఆర్సీ చార్జ్ తీసుకున్న తర్వాత నివేదిక సమర్పించేందుకు ఏడాది గడువు ఇవ్వడం అవసరం లేదని, మూడు, నాలుగు నెలల్లోనే ప్రక్రియ పూర్తి చేసి నివేదిక సమర్పించేలా నియామక జీఓను సవరించాలని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పీఆర్సీ నియామకంపై ప్రభుత్వం ఇప్పటికే జాప్యం చేసిందని, ఇప్పుడు నివేదికకు మరో ఏడాది సమయం ఇవ్వడం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు మరింత నష్టం జరుగుతుందని అన్నారు. పీఆర్సీ ప్రక్రియను వేగవంతం చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన పీఆర్సీ, మధ్యంతర భృతి హామీలను అమలు చేయాలని చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అక్టోబర్‌లోనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, పీఆర్సీ నివేదిక కోసం ఉద్యోగులు మరో ఏడాది వేచి ఉండాల్సిన అవసరం లేకుండా తక్షణ ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని కోరారు. డీఏలు, పీఆర్సీ, ఐఆర్ తదితర పెండింగ్ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని అన్నారు. పీఆర్సీ విషయంలో మరింత జాప్యం చేస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశం ఉందని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పీఆర్సీ అమలు తేదీని భవిష్యత్తులోకి నెట్టడం ద్వారా ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు నష్టం కలగకుండా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నియామక జీఓను సవరించి మూడు, నాలుగు నెలల్లో నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు 30 శాతం ఐఆర్‌ను తక్షణమే మంజూరు చేయాలని కోరారు.

## గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : మంత్రి దుర్గేష్



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్):** జాతిపిత మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా నిడదవోలు గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' సంకల్పంతో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ ప్రజలు, అధికారులతో కలిసి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, సేవా స్ఫూర్తితో గాంధీ చూపిన మార్గం తరతరాలకు ఆదర్శప్రాయమని, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచి పరిశుభ్రమైన సమాజాన్ని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

నిడదవోలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మంత్రి బహుమతులు అందజేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ విధుల్లో ప్రతిభ కనబరిచిన మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులను మెమెంటోలతో సత్కరించి అభినందించారు. పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 'జోహార్ మహాత్మా గాంధీ' నినాదాలు మార్మోగాయి.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి...ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు 'మీకోసం' కార్యక్రమం



**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు వేమూరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో 'మీకోసం (పీజీఆర్ఎస్)' ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. రెవెన్యూ, భూ సమస్యలు, పంచాయతీరాజ్, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, సాగునీరు, వ్యవసాయం, పెన్షన్లు, రేషన్, గృహాలు, వైద్యం, విద్య, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులతో పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని నక్కా ఆనందబాబు సూచించారు. ఫిర్యాదు స్వీకరించడంతో బాధ్యత ముగియదని, సమస్య పరిష్కారమయ్యే వరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఫాలోఅప్ చేయాలని అన్నారు. ప్రజలు ఒక సమస్య కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్, రేషన్, గృహం, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజల సమస్యలను వినడంతో పాటు వాటి పరిష్కారం జరిగే వరకు బాధ్యతగా వ్యవహరించడమే నిజమైన ప్రజాసేవ అని నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## పీఆర్సీ నివేదిక ఆరు నెలల్లో ఇవ్వాలి

**○ వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలి**

**○ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** పీఆర్సీ కమిషన్‌కు గరిష్ఠంగా ఆరు నెలల గడువు మాత్రమే ఇచ్చి నివేదికను సమర్పించేలా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరపు జాలిరెడ్డి, షేక్ జంషీద్ డిమాండ్ చేశారు. గత పీఆర్సీ కాలపరిమితి ముగిసి సుమారు మూడేళ్లు గడిచినా వేతన సవరణ ప్రయోజనాలు అందక ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. ఇప్పటికే జాప్యం జరిగిన నేపథ్యంలో కొత్త కమిషన్‌కు ఏడాది గడువు ఇవ్వడం ఉద్యోగుల్లో మరింత నిరాశకు దారితీస్తుందని పేర్కొన్నారు.

పీఆర్సీ నివేదిక వచ్చే వరకు ఉద్యోగులపై ఆర్థిక భారం పెరగకుండా ప్రభుత్వం వెంటనే కనీసం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని వారు కోరారు. పీఆర్సీ అమలులో జాప్యం కారణంగా జరిగిన ఆర్థిక నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణ ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. గత పీఆర్సీ అనంతరం కొత్త వేతన సవరణ కోసం ఎదురుచూస్తూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పీఆర్సీ ప్రయోజనాలు అందేలా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు.

పీఆర్సీ కమిషన్‌కు ఆరు నెలల స్పష్టమైన గడువు, వెంటనే మధ్యంతర భృతి, ఇప్పటికే పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు న్యాయం చేసేలా ప్రత్యేక విధానం రూపొందించడం వంటి మూడు అంశాలపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై ఇకపై జాప్యం చేయకుండా వేగంగా చర్యలు చేపట్టాలని కోరారు.

## వీఆర్వోల ఐక్యతకు ప్రతీకగా ఏకగ్రీవ ఎన్నికలు



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గం 2026--2029 కాలానికి ఏకగ్రీవంగా ఎన్నికైంది. విజయవాడ రెవెన్యూ భవన్‌లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన వీఆర్వోలు ఎలాంటి పోటీ లేకుండా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కోన ఆంజనేయ కుమార్ (చంటి), ప్రధాన కార్యదర్శిగా ఎం. బాపూజీ, సహాధ్యక్షుడిగా టి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలిగా జి. అనుపమ, ప్రచార కార్యదర్శిగా జి. దిల్లేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కే. సాహితి ఎన్నికయ్యారు.

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని జిల్లాల నుంచి వీఆర్వోలు పెద్ద సంఖ్యలో హాజరై ఏకగ్రీవ ఎన్నికలకు సహకరించడం వారి ఐక్యతకు నిదర్శనమన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడంలో వీఆర్వోల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజలు పారదర్శక, వేగవంతమైన సేవలను ఆశిస్తున్నందున వీఆర్వోలు అంకితభావంతో పనిచేయాలని, వారికి అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

నూతన కార్యవర్గం మాట్లాడుతూ ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారంతో పాటు బాధ్యతాయుత విధి నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపింది. ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ఉన్న వీఆర్వోలు పారదర్శకత, నిబద్ధతతో పనిచేస్తూ రెవెన్యూ సేవలను వేగంగా అందించాలని పేర్కొంది. "ఉద్యోగుల హక్కుల సాధన మా బాధ్యత.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం మా కర్తవ్యం" అనే స్ఫూర్తితో ముందుకు సాగుతామని వెల్లడించింది.

కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఎన్నికల అధికారి చేబ్రోలు కృష్ణమూర్తి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎన్నికల సహాయ అధికారి బత్తిన రామకృష్ణ, ఉపాధ్యక్షురాలు పొన్నూరు విజయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శులు సీహెచ్. సురేష్, డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. వీఆర్వోల సమస్యల పరిష్కారం, సంఘ ఐక్యత, ఉద్యోగుల సంక్షేమం, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవల కోసం నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు.

## బీజేపీ లక్ష్యం... స్వదేశీ స్వావలంబన

**○ ఖాదీని ఫ్యాషన్‌గా మార్చిన మోదీ ప్రభుత్వం**

**○ 'లోకల్ ఫర్ వోకల్'కు ప్రధాని మోదీ ప్రాధాన్యం**

**○ చేనేత, స్థానిక ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి: బీజేపీ నేతల పిలుపు**



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా దేశాన్ని ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ దేశీయ ఉత్పత్తులను వినియోగించాలని బీజేపీ రాష్ట్ర ఇంఛార్జి అరవింద్ సింగ్ భదోరియా పిలుపునిచ్చారు. గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా విజయవాడ ఐవీ ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన ఖాదీ సంతను రాష్ట్ర సహ ఇంఛార్జి వనతి శ్రీనివాసన్, రాష్ట్రాల సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ తో కలిసి ప్రారంభించారు.

స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మా గాంధీ స్వదేశీ, ఖాదీ ఉద్యమాలను ప్రజల్లోకి తీసుకెళ్లారని భదోరియా తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం 'లోకల్ ఫర్ వోకల్'కు ప్రాధాన్యం ఇస్తూ స్థానిక తయారీదారులు, కళాకారులు, చేనేత కార్మికులను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. దేశీయ ఉత్పత్తుల వినియోగం, ఎగుమతుల పెంపు ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు.

గాంధీ ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వనతి శ్రీనివాసన్ అన్నారు. భారతీయ కళలు, చేనేత, సంప్రదాయ వస్త్రాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కలంకారీ, శ్రీకాళహస్తి కళారూపాలతో పాటు చేనేతకు మరింత ప్రాచుర్యం కల్పించాలని, ప్రజలు తమ దుస్తుల కొనుగోళ్లలో చేనేతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఖాదీని కేవలం వస్త్రంగా కాకుండా ఫ్యాషన్‌గా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని మధుకర్ జీ అన్నారు. సంప్రదాయ వృత్తులు, కళలు, చేనేత రంగాల పరిరక్షణతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఖాదీ సంతల ద్వారా స్వదేశీ ఉత్పత్తులపై ప్రజల్లో అవగాహన పెంచవచ్చని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు తెలిపారు.

కార్యక్రమానికి ఎమ్మెల్సీ పోతుల సునీత హాజరుకాగా, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. ఖాదీబోర్డు మాజీ ఛైర్మన్ చంద్రమౌళి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, బిట్ర శివన్నారాయణ, బీజేపీ హెడ్‌క్వార్టర్స్ ఇంఛార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర మీడియా ఇంఛార్జి కిలారి దిలీప్, అధికార ప్రతినిధులు ముళ్లపూడి రేణుక, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** మధురవాడలోని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోన్-3 ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ అందించిన సేవలు, సత్యం, శాంతి, అహింస వంటి ఆదర్శాలు నేటి సమాజానికి మార్గదర్శకాలని అన్నారు.

విద్యుత్ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంతో పాటు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా, మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై జోన్-3 డివిజన్‌ను పరిశుభ్రత, సేవల పరంగా ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందితో భద్రతా ప్రతిజ్ఞ చేయించి, విద్యుత్ విధుల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్, అకౌంట్స్, రెవెన్యూ, ఓఅండ్ఎం, అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో పాటు వివిధ యూనియన్లు, అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సేవా మార్గాలను స్ఫూర్తిగా తీసుకుని వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

## అంగన్‌వాడీ సిబ్బందికి బీజేపీ మహిళా మోర్చా ఘన సన్మానం



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా విజయవాడ పాల ఫ్యాక్టరీ సమీపంలోని వి. కన్వెన్షన్‌లో 'అంగన్‌వాడీ ఉత్సవ్' కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఇంఛార్జి వనతి శ్రీనివాసన్ ముఖ్య అతిథిగా, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు ఎం. నిషిధ రాజు అతిథిగా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల సంరక్షణ, పోషణతో పాటు తల్లులు, శిశువుల సంక్షేమానికి సేవలందిస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. వారి సేవలను నాయకులు అభినందించారు.

కార్యక్రమంలో భాగంగా తల్లులకు చీర, తాంబూలం అందజేశారు. మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సేవలను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పీఆర్సీ కమిషనర్‌గా దినేష్ కుమార్ నియామకంపై హర్షం

**○ ఎంఈఓ-1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** 12వ వేతన సవరణ కమిషనర్‌గా మాజీ చీఫ్ సెక్రటరీ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎంఈఓ-1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం హర్షం వ్యక్తం చేశారు. లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు వేతన సవరణ కోసం ఎదురుచూస్తున్న తరుణంలో పీఆర్సీ కమిషనర్ నియామకం హర్షణీయమన్నారు. వేతన సవరణ అమలు ఇప్పటికే దాదాపు మూడేళ్లు ఆలస్యమైనందున, పీఆర్సీ నివేదిక వచ్చేలోగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలని సామల సింహాచలం ప్రభుత్వాన్ని కోరారు. ఈ దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు ఊరట కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## ఉద్యోగ సమస్యలపై జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో ఎన్జీజీఓ చర్చలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ తో ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, ఇరిగేషన్ ఎన్జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు చర్చించారు. ఇరిగేషన్ శాఖలో 46 సర్కిళ్ల పరిధిలో పనిచేస్తున్న సుమారు 12 వేల మంది ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 ప్రకారం స్థానిక క్యాడర్ అంశాలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సర్కిల్ పరిధిలోని క్యాడర్ల సీనియారిటీ, స్కేల్ ఎస్టాబ్లిష్‌మెంట్, వర్క్‌చార్జ్ సిబ్బంది సమస్యలను కూడా వారి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో జరిగిన చర్చల్లో ప్రస్తావించిన పే రివిజన్ కమిషన్ నియామకం, డీఏ బకాయిలు, హెల్త్ ట్రస్ట్ ప్రీమియం రికవరీ, పెన్షనర్ల అదనపు క్వాంటమ్ పెంపు, స్వర్ణ గ్రామ వార్డు ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ వంటి అంశాలపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల విద్యాసాగర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పీఆర్సీ, హెల్త్ కార్డుల అమలు, నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఎన్టీఆర్ హెల్త్ ట్రస్ట్ నుంచి చెల్లింపులు తదితర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎన్జీజీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏలూరు జిల్లా ఏపీఎన్జీజీఓ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎన్జీజీఓస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.సి. హెచ్. కృష్ణారెడ్డి, ఏపీఎన్జీజీఓస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ మొహమ్మద్ జానిపాషా, రాష్ట్ర కార్యదర్శి ఎల్. రజనీష్ బాబు, క్యాపిటల్ సిటీ నాయకుడు పురుషోత్తమ నాయుడు, ఇరిగేషన్ ఎన్జీజీఓస్ రాష్ట్ర కార్యదర్శి జి.జె. ప్రసాద్, తెల్లమేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com